

TGTEL/26/A2094

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 286 | హైదరాబాద్ | మంగళవారం | 24-03-2026 | పేజీలు: 08


## పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు?

అసెంబ్లీలో ప్రతిపక్షంపై మంత్రి సీతక్క ఆగ్రహం

హరీష్ రావు విమర్శలకు ఘాటు స్పందన

బీఆర్ఎస్ పదేళ్ల పాలనను ఎండగట్టిన మంత్రి

గత పాలనలో చేసిన అప్పులపై విమర్శలు

అప్పులతో ఏం చేశారో లెక్క చెప్పాలని సవాల్

రుణమాఫీ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నలు

నిరుద్యోగులను వంచించారని ఆగ్రహం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. బడ్జెట్ చర్చల సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు చేసిన విమర్శలపై పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. నిరుద్యోగ భృతి, నోటిఫికేషన్లు, రైతు రుణమాఫీ వంటి అంశాలపై హరీష్ రావు వేసిన ప్రశ్నలకు సీతక్క సూటిగా, ఘాటుగా సమాధానమిచ్చారు. పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రానికి అప్పుల కుప్పను అప్పగించి, ఇప్పుడు ఆరు నెలల పాలనపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని ఆమె

..మిగతా 2లో

## విశ్వనగరంగా హైదరాబాద్!

ట్రాఫిక్ కష్టాలకు ముగింపు పలుకుతాం

మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లతో అభివృద్ధి

రూ.24 వేల కోట్లతో

76 కిలోమీటర్ల మెట్రో రెండో దశ

ట్రాఫిక్ ఫ్రీ సిటీ కోసం

అండర్ పాస్, సర్ఫేస్ రోడ్లు

ఎలివేటెడ్ కారిడార్ల

త్రిముఖ వ్యూహం

కంటోన్మెంట్

అడ్డంకులు తొలగింపు

బేగంపేట ఎయిర్‌పోర్ట్

రన్ వే కింద టన్నెల్ నిర్మాణం

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు

నేరుగా మెట్రో కనెక్టివిటీ

ఐటీ కారిడార్‌లో

నియోపోలిస్ వరకు పొడిగింపు

శాసన మండలిలో

సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

భాగ్యనగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికలను సిద్ధం చేసింది. ముఖ్యంగా నగరవాసులను వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శాసనమండలిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించిన రోడ్ మ్యాప్‌ను వివరించారు. ఓఆర్ఆర్ (ORR) లోపల ఉన్న ప్రాంతాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చి, సమగ్ర అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ

..మిగతా 2లో

## బడ్జెట్ అంటే అంకెల గారడీయేనా?

అసెంబ్లీలో సర్కారుపై

హరీష్ రావు విమర్శలు

రైతు భరోసా

హామీపై ప్రశ్నల వర్షం

ఎకరాకు రూ.15 వేలు

అని మాట తప్పారని ఆరోపణ

ఇందిరమ్మ భరోసా

ప్రస్తావనే లేదని ఎద్దేవా

మూడు సీజన్ల పెట్టుబడి సాయం ఎగ్గొట్టారని ఆగ్రహం

రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఏమైందన్న మాజీ మంత్రి

మద్యం ఆదాయంపైనే ప్రభుత్వం ఆధారపడిందన్న హరీశ్

రూ. 12 వేల కోట్ల అదనపు టార్గెట్ వెనుక మతలబు ఏంటని ప్రశ్న

ప్యూరిటీ, క్లారిటీ లేని బడ్జెట్ అంటూ అసంతృప్తి



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చా వేదికగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వాస్తవాలు తక్కువ, అంకెల గారడీ ఎక్కువ ఉందని ఆయన ఎండగట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ముఖ్యంగా రైతులకు, నిరుద్యోగులకు ఈ బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చిందని మండిపడ్డారు. ప్రభుత్వం చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు అస్సలు పొంతన లేదని గణాంకాలతో సహా వివరించారు.

**రైతు భరోసాపై 'కౌంటర్' దాడి**

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు ఊరూరా తిరిగి ఎకరానికి రూ. 15 వేల రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారని హరీష్ రావు గుర్తు చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని అటకెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా వంటి

..మిగతా 2లో

## ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ బీఆర్ఎస్ ప్రైవేట్ మెంబర్ బిల్లు

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత

కోరిన బీఆర్ఎస్

అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్

బిల్లు నోటీసు

పథకాల అమలులో

పారదర్శకతపై దృష్టి

బడ్జెట్ సమావేశాల్లోనే

చర్చకు డిమాండ్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్

..మిగతా 2లో



## దానం నాగేందర్ కు హైకోర్టు నోటీసులు..!

దానం పార్టీ మారలేదని

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్

నిర్ణయాన్ని సవాల్ చేస్తూ..

బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

హైకోర్టులో పిటిషన్ దాఖలు..

నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని

దానం నాగేందర్ కు హైకోర్టు ఆదేశం..

విచారణ వచ్చేనెల 16 కు వాయిదా..



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు తెలంగాణ హైకోర్ట్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులో పార్టీ మార్పు అంశంపై నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా

..మిగతా 2లో

## మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సిద్ధం

2011 జనాభా ఆధారంగా

రిజర్వేషన్ అమలు

నియోజకవర్గాల

పునర్విభజనపై కసరత్తు

రాజ్యాంగ సవరణలకు

కీలక నిర్ణయాలు

వచ్చే వారం పార్లమెంట్‌లో

బిల్లుకు అవకాశం

కొత్త చట్టం ప్రకారం సీట్లు

816కు పెంపు

33 శాతంతో మహిళలకు

273 సీట్లు కేటాయింపు

ప్రతిపక్షాల మద్దతు కోసం

బీజేపీ ప్రయత్నాలు



**నేషనల్‌బ్యూరో, (ప్రజాక్షేత్రం):**

దేశంలో మహిళలు రాజకీయాల్లో సమాన భాగస్వాములు కావాలనే లక్ష్యంతో గతంలో తీసుకొచ్చిన చట్టం ఇప్పటి వరకు అమలు కాలేదు. దీనికి ముఖ్య కారణం నియోజకవర్గాల పునర్విభజన పని ఇంకా పూర్తి కాలేదు. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త మార్గం చూపించింది. 2011 జనాభా లెక్కలను ఆధారం చేసుకొని మహిళా

..మిగతా 2లో

# విశ్వనగరంగా హైదరాబాద్!

మొదటిపేజీ తరువాయి

ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

మెట్రో రెండో దశ: 76 కిలోమీటర్ల విస్తరణ హైదరాబాద్ మెట్రో గత పదేళ్లలో విస్తరణ లేక దేశంలో 9వ స్థానానికి పడిపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సరిదిద్దేందుకు రూ. 24 వేల కోట్లతో రెండో దశ పనులను చేపట్టబోతున్నట్లు ప్రకటించారు. 76 కిలోమీటర్ల మేర సాగే ఈ విస్తరణలో భాగంగా, నగర శివారు ప్రాంతాలైన హయత్‌నగర్, రామచంద్రాపురం వంటి లాస్ట్ మైల్ కనెక్టివిటీ ప్రాంతాలను మెట్రోతో అనుసంధానించనున్నారు. ఎల్ అండ్ టీ సంస్థ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని భావిస్తున్న తరుణంలో, కేంద్ర నిబంధనల ప్రకారం మెట్రోను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది.



**ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి**

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికుల కోసం మెట్రో మార్గాన్ని మార్పు చేశారు. నాగోల్, ఎల్బీనగర్, ఓవైసీ హాస్పిటల్, చాంద్రాయగుట్ట, రాజేంద్రనగర్ మీదుగా విమానాశ్రయం వరకు మెట్రోను పొడిగిస్తున్నారు. పాతబస్తీలో ఆగిపోయిన పనులను పునరుద్ధరించి ఫలక్‌నుమా నుంచి చాంద్రాయగుట్ట జంక్షన్‌కు కనెక్ట్ చేస్తున్నారు. అలాగే ఐటీ కారిడార్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్ వరకు మెట్రోను విస్తరించి లక్షలాది మంది ఐటీ ఉద్యోగుల ప్రయాణ కష్టాలను తీర్చనున్నారు.

**కంటోన్మెంట్ అడ్డంకులు తొలగింపు..**

**అండర్ టన్నెల్ నిర్మాణం**

ఉత్తర తెలంగాణ వైపు వెళ్లే కరీంనగర్, మేడ్చల్ మార్గాల్లో కంటోన్మెంట్ ప్రాంతం పెద్ద బాటిల్ నెక్‌గా మారింది. దీనిని తొలగించేందుకు కేంద్ర రక్షణ శాఖను ఒప్పించి 153 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. దీనికి బదులుగా రక్షణ శాఖకు మరోచోట భూమిని కేటాయించింది. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద నుంచి అండర్ టన్నెల్ నిర్మించేందుకు అనుమతులు పొందడం ఒక చారిత్రాత్మక విజయమని సీఎం పేర్కొన్నారు. దీనివల్ల ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది.

**నగరంలో కొత్త ఎలివేటెడ్ కారిడార్లు**

ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న బంజారా హిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్ట్‌కు సులభంగా వెళ్లేందుకు కొత్త మార్గాలను పరిశీలిస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ రోడ్ నుంచి రాయదుర్గం నాలెడ్జ్ పార్క్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించి, దానిని పీవీ ఎక్స్‌ప్రెస్ వేకు అనుసంధానం చేయనున్నారు. అలాగే నల్గొండ చౌరస్తా వద్ద నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ ఈ ఏడాది జూన్ లేదా జూలై నాటికి అందుబాటులోకి రానుంది.

**మూసీ వెంట 43 కిలోమీటర్ల మేర ప్రయాణం**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా నది వెంట భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. హిమాయత్ సాగర్ జంక్షన్ నుంచి గౌరవెల్లి వరకు 43 కిలోమీటర్ల మేర సాగే ఈ కారిడార్‌పై పలు చోట్ల ట్రంపెట్లను ఏర్పాటు చేస్తారు. దీనివల్ల నగరంలోని ఒక మూల నుంచి మరో మూలకు ట్రాఫిక్ చిక్కులు లేకుండా వేగంగా వెళ్లే అవకాశం కలుగుతుంది. అంతేకాకుండా, నగరంలో పార్కింగ్ సమస్యను తీర్చడానికి కేబీఆర్ పార్క్, నాంపల్లి వంటి చోట్ల మల్టీ లెవల్ పార్కింగ్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

**పాదచారుల కోసం 'ఆపరేషన్ రోప్'**

నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ వల్ల పాదచారులు రోడ్లపైకి రావడం, తద్వారా ట్రాఫిక్ జామ్ అవ్వడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. చిరు వ్యాపారులకు కొంత ఇబ్బంది కలిగినప్పటికీ, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా 'ఆపరేషన్ రోప్' ద్వారా ఆక్రమణలను తొలగిస్తున్నారు. అలాగే 360 కిలోమీటర్ల మేర విస్తరించి ఉండే రీజినల్ రింగ్ రోడ్డు (RRR)కు, ఓఆర్ఆర్ కు మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేస్తున్నారు.

**విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు అండ**

అభివృద్ధి పనులతో పాటు మానవీయ కోణంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ శాఖ ఉద్యోగులు ఓర్సు సురేష్, ముఖ్తార్ బేగ్ కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబాలు వీధిన పడకూడదనే ఉద్దేశంతో ఈ పరిహారాన్ని పెంచినట్లు తెలిపారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# బడ్జెట్ అంటే అంకెల గారడీయేనా?

మొదటిపేజీ తరువాయి

విపత్కర పరిస్థితుల్లో కూడా ఒక్క సీజన్ కూడా ఆపకుండా రైతుబంధు ఇచ్చామని, కానీ ఈ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్ల పెట్టుబడి సాయాన్ని రైతులకు ఎగ్గొట్టిందని ఆరోపించారు. కుడి చేత్తో రైతు బంధు నిధులను ఆపేసి, ఎడమ చేత్తో రుణమాఫీ చేశామని చెప్పడం రైతులను వంచించడమేనని ధ్వజమెత్తారు. కెసిఆర్ ది 'పెట్టుబడి సాయం' అయితే, రేవంత్ రెడ్డి ది కేవలం 'ఎన్నికల పెట్టుబడి సాయం' అని ఎద్దేవా చేశారు.

**కూలీలకు అన్యాయం.. బోనస్ లో 'బోగస్'**

భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' ఇస్తామని చెప్పి, రెండు బడ్జెట్లు గడిచినా ఒక్క రూపాయి కూడా ఎందుకు కేటాయించలేదని హరీష్ రావు ప్రశ్నించారు. ఇందిరా గాంధీ పేరు పెట్టుకుని పేద కూలీల కడుపు కొట్టడం ధర్మమేనా అని నిలదీశారు. వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామన్న హామీని కేవలం సన్న రకాలకే పరిమితం చేసి, మెజారిటీ రైతులను మోసం చేశారని విమర్శించారు. బడ్జెట్‌లో పంటల బీమా కోసం రూ. 1,300 కోట్లు కేటాయించినా, క్షేత్రస్థాయిలో ఒక్క రైతుకు కూడా దాని ప్రయోజనం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**మద్యం ఆదాయంపైనే కక్కుర్తి?**

రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వం ఎంచుకున్న మార్గంపై హరీష్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఎక్సైజ్ ఆదాయాన్ని రూ. 34 వేల కోట్ల నుంచి రూ. 46 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆయన మండిపడ్డారు. అంటే అదనంగా రూ. 12 వేల కోట్ల ఆదాయం రావాలంటే ఊరూరా బార్లు, గల్లీ గల్లీకి బెల్టు షాపులు ఓపెన్ చేస్తారా అని నిలదీశారు. ఆదాయం కోసం జనాన్ని తాగుబోతులుగా మార్చడమేనా మీ పద్ధతి అని ప్రశ్నించారు. దీనిపై ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ గత ప్రభుత్వం కూడా ఆదాయాన్ని పెంచిందని చెప్పగా, హరీష్ రావు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ తాను ఆర్థిక మంత్రిని ప్రశ్నలు అడుగుతున్నానని స్పష్టం చేశారు.

**నిరుద్యోగుల గోస..**

**మాయమైన జాబ్ క్యాలెండర్**


మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని హరీష్ రావు నిలదీశారు. గత బడ్జెట్‌లో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, ఈ బడ్జెట్‌లో కనీసం ఆ ప్రస్తావనే లేకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనని అన్నారు. ఉద్యోగాల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అశోక్ నగర్ అభ్యర్థులపై లాఠీచార్జీలు చేయడం ప్రభుత్వ అప్రజాస్వామిక పాలనకు నిదర్శనమని ఖండించారు. రాహుల్ గాంధీ మాటలు నమ్మి ఓటేసిన నిరుద్యోగులు నేడు రోడ్ల మీద లాఠీ దెబ్బలు తింటున్నారని, వారి పరిస్థితి వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు.

**రుణమాఫీలో అసంపూర్తి లెక్కలు**

ప్రభుత్వం రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో వేలాది మంది రైతులు ఇప్పటికీ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని హరీష్ రావు గుర్తు చేశారు. రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, లబ్ధిదారుల సంఖ్యకు వాస్తవానికి పొంతన లేదని ఆరోపించారు. ప్రభుత్వం చెప్పే అంకెల గారడీ వల్ల రైతులు అయోమయంలో ఉన్నారని, వెంటనే అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**బడ్జెట్‌లో ప్యూరిటీ, షూరిటీ ఎక్కడ?**

ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎక్కడా స్పష్టత లేదని హరీష్ రావు విమర్శించారు. ఈ బడ్జెట్‌లో 'ప్యూరిటీ' (పరిశుద్ధత), 'క్లారిటీ' (స్పష్టత), 'షూరిటీ' (నమ్మకం) ఏమీ లేవని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలంటే లక్షల కోట్లు అవసరమవుతాయని, కానీ బడ్జెట్‌లో దానికి సరిపడా కేటాయింపులు లేకపోవడం చూస్తుంటే ఈ ప్రభుత్వం కేవలం కాలయాపన చేస్తోందని అర్థమవుతోందని విమర్శించారు.



ప్రభుత్వం ఇప్పటికైనా అంకెల గారడీ పక్కన పెట్టి, రైతులకు బకాయి పడ్డ పెట్టుబడి సాయాన్ని విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, రైతు కూలీలకు ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేయాలని కోరారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు.

# పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు?

మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు.

అప్పుల కుప్పపై సీతక్క ధ్వజం

బీఆర్ఎస్ హయాంలో చేసిన విచ్చలవిడి అప్పులు ప్రస్తుత ప్రభుత్వానికి గుదిబండగా మారాయని సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. "పాండవులు కష్టపడి సంపాదించింది అంతా కౌరవుల తద్దినానికే సరిపోయినట్లుగా ఉంది మా పరిస్థితి" అని ఆమె ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం చేసిన లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కట్టడానికే ఇప్పుడు ప్రభుత్వ ఖజానాలోని నిధులు సరిపోతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఆర్థిక వెసులుబాటును బట్టి ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.

**రుణమాఫీపై హరీష్‌కు ప్రశ్నల వర్షం**

హరీష్ రావు తన నియోజకవర్గంలో 50 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని విమర్శించడాన్ని సీతక్క తప్పుబట్టారు. "హరీష్ అన్న.. మీరు పదేళ్లు అధికారంలో ఉన్నారు, ఫైనాన్స్ మినిస్టర్‌గా కూడా చేశారు. మరి మీ హయాంలోనే రుణమాఫీ ఎందుకు పూర్తి చేయలేదు? అప్పుడే చేసి ఉంటే ఇప్పుడు రైతులకు ఈ ఇబ్బంది ఉండేది కాదు కదా?" అని నిలదీశారు. ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, కానీ తమ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి అడుగులు వేస్తోందని చెప్పారు.

**నిరుద్యోగుల అంశంపై నిలదీత**

అశోక్ నగర్ లాఠీచార్జీలు, నిరుద్యోగుల సమస్యలపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు సీతక్క గట్టి కౌంటర్ ఇచ్చారు. పదేళ్ల కాలంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం నోటిఫికేషన్లు వేసి వదిలేయడం ఉద్యోగాలు ఇవ్వడం కాదని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేల సంఖ్యలో నియామక పత్రాలు అందజేసి నిరుద్యోగుల ఇళ్లలో వెలుగులు నింపామని గుర్తు చేశారు. ఉద్యోగాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగులను వంచించింది గత ప్రభుత్వమేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అధికారం పోయిందన్న బాధే అసలు కారణం**

హరీష్ రావు చేస్తున్న విమర్శల వెనుక ప్రజల పట్ల ప్రేమ లేదని, కేవలం అధికారం కోల్పోయిన బాధ మాత్రమే ఉందని సీతక్క వ్యాఖ్యానించారు. "సీటు మారినంత మాత్రాన చరిత్ర మారిపోదు. పదేళ్లు అంటే చాలా సమయం.. అప్పుడు చేయని పనులు ఇప్పుడు చేయలేదని మమ్మల్ని అడగడం ఏంటి?" అని ప్రశ్నించారు. ప్రజల కోసం తాము ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ జీవిత బీమా', ఐదు లక్షల ప్రమాద బీమా వంటి పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షం బురద చల్లే రాజకీయం చేస్తోందని విమర్శించారు.

**గత పదేళ్ల లెక్కలు చెప్పండి**

రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నప్పుడు గత ప్రభుత్వం ఎక్కడ ఉందని సీతక్క ప్రశ్నించారు. తాము చేస్తున్న మంచి పనుల్లో మట్టి పోయడం మానుకోవాలని సూచించారు. "ముందు మీరు చేసిన పనుల లెక్క చెప్పండి.. ఆ తర్వాత మేము ఏం చేయాలో చెప్పండి" అని హరీష్ రావుకు సవాల్ విసిరారు. వడ్డీలకు వడ్డీలు కట్టాల్సి వస్తున్నా, సంక్షేమ పథకాలను ఆపకుండా ముందుకు తీసుకెళ్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.

**ఇందిరమ్మ ఇళ్లు.. నిరుపేదల ఆశలు**

గత ప్రభుత్వం పదేళ్లలో ఎన్ని ఇళ్లు ఇచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని సీతక్క డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం ఈ రెండేళ్లలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టి చూపిస్తుందని సవాల్ చేశారు. సన్నబియ్యం పంపిణీ ద్వారా పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని, ఈ అభివృద్ధిని అడ్డుకోవద్దని కోరారు. సీటు మారగానే నీతులు చెప్పడం మానుకుని, నిర్మాణాత్మకమైన సూచనలు చేయాలని హితవు పలికారు.



**ప్రజల పక్షాన నిలబడతాం**

చివరగా, ఎన్ని అడ్డంకులు ఎదురైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందని సీతక్క స్పష్టం చేశారు. అప్పుల బాధలు ఉన్నా, పేదవాడి సంక్షేమమే తమ ప్రథమ ప్రాధాన్యతని చెప్పారు. ప్రతి కుటుంబానికి భరోసా ఇచ్చేలా ప్రభుత్వం పనిచేస్తోందని, విమర్శలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు.

# మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని నిర్ణయించింది. దీనికోసం పార్లమెంట్‌లో వచ్చే వారం ఒక సవరణ బిల్లు తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ కొత్త చట్టం దేశంలోని మహిళలందరికీ రాజకీయాల్లో బలమైన స్థానం కల్పిస్తుందని ఆశాభావాలు వ్యక్తమవుతున్నాయి.

**గత చట్టం అమలు ఎందుకు ఆలస్యమైంది?**

2013లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించాలని చెప్పింది. కానీ ఈ చట్టం అమలు కావాలంటే ముందు కొత్త జనాభా లెక్కలు తీసుకోవాలి. ఆ తర్వాత నియోజకవర్గాలను మళ్లీ విభజించాలి. ఈ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు కాబట్టి చట్టం కాగితాల మీదే మిగిలిపోయింది. మహిళలు రాజకీయాల్లో ముందుకు రావాలని చాలా మంది ఆశించారు. కానీ ఈ ఆలస్యం వల్ల వారి ఆశలు నిరాశగా మారాయి. ఇప్పుడు కేంద్రం ఈ సమస్యను పరిష్కరించడానికి కొత్త ఆలోచన చేసింది. పునర్విభజన ఆగకుండానే 2011 జనాభా ఆధారంగా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రతిపాదించింది. ఇది మహిళలకు పెద్ద ఉపకారం అవుతుంది.

**2011 జనాభా లెక్కలతో**

**కొత్త ప్రణాళిక ఎలా ఉంటుంది?**

కేంద్రం తాజా నిర్ణయం ప్రకారం ఇప్పుడు ఉన్న 543 లోక్‌సభ సీట్ల సంఖ్యను 816కి పెంచుతారు. ఈ కొత్త సీట్లలో 273 సీట్లు మహిళలకు ప్రత్యేకంగా రిజర్వ్ చేస్తారు. ఇది గత చట్టంలో చెప్పిన 33 శాతం రిజర్వేషన్‌కు సరిపోతుంది. ఇప్పటి వరకు కొత్త జనాభా లెక్కలు తీసుకోవాలని, ఆ తర్వాతే రిజర్వేషన్ అమలు చేయాలని చట్టం చెప్పింది. కానీ దేశంలో మారుతున్న పరిస్థితులు చూసి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. 2011 జనాభా లెక్కలు ఇప్పటికీ చాలా సీట్ల విభజనకు ఉపయోగపడతాయి. ఇందుకోసం ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఒక బిల్లు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పు వల్ల మహిళలు ఎక్కువ సంఖ్యలో పార్లమెంట్‌కు వచ్చి తమ సమస్యలు పరిష్కరించగలరు. ఇది దేశ అభివృద్ధికి కూడా ఉపయోగపడుతుంది.

**లోక్‌సభ సీట్ల సంఖ్య పెరగడం వల్ల కలిగే ప్రయోజనాలు**

ప్రస్తుతం లోక్‌సభలో 543 సీట్లు ఉన్నాయి. కొత్త చట్టం అమలైతే ఇది 816కి పెరుగుతుంది. ఇందులో మహిళలకు 273 సీట్లు కేటాయించడం జరుగుతుంది. ఇది చాలా పెద్ద మార్పు. ఇప్పుడు ఉన్న సీట్లలో మహిళల సంఖ్య చాలా తక్కువ. కొత్త సీట్లు వచ్చిన తర్వాత మహిళలు ఎక్కువ మంది ఎన్నికై వస్తారు. దీంతో పార్లమెంట్‌లో మహిళల సమస్యలు, వారి అవసరాలు ఎక్కువగా చర్చకు వస్తాయి. ఉదాహరణకు విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి విషయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయి. ఇంకా రాష్ట్రాల్లోని శాసనసభలకు కూడా ఈ రిజర్వేషన్ వర్తించాలి. దీని వల్ల దేశవ్యాప్తంగా మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరుగుతుంది. కేంద్రం ఈ మార్పును త్వరగా అమలు చేయాలని భావిస్తోంది. ఇది దేశ చరిత్రలో ఒక మైలురాయి అవుతుంది.

**మహిళలకు 273 సీట్లు రిజర్వ్ చేయడం ఎంత ముఖ్యం?**

కొత్త చట్టం ప్రకారం మొత్తం 816 సీట్లలో 273 సీట్లు మహిళలకు మాత్రమే ఇవ్వాలి. ఇది గతంలో ఆమోదించిన 33 శాతం రిజర్వేషన్‌కు ఖచ్చితంగా సరిపోతుంది. ఇప్పుడు లోక్‌సభలో మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంది. కొత్త ఏర్పాటు వల్ల వారు ఎక్కువ సంఖ్యలో వచ్చి తమ అభిప్రాయాలు వ్యక్తం చేయగలరు. మహిళలు రాజకీయాల్లో ఎక్కువ పాల్గొనాలంటే ఇలాంటి రిజర్వేషన్ చాలా అవసరం. ఇది వారికి ఆత్మవిశ్వాసం కలిగిస్తుంది. ఇంకా గ్రామాలు, పట్టణాల్లోని సమస్యలు పార్లమెంట్‌లో చర్చకు వస్తాయి. కేంద్రం ఈ రిజర్వేషన్‌ను ముందుగానే అమలు చేయడం వల్ల మహిళలు త్వరగా లాభపడతారు. ఇది దేశంలో సమానత్వం కోసం ఒక చక్కని అడుగు.

**రాజ్యాంగ సవరణ ఎందుకు అవసరం అవుతోంది?**

గత చట్టంలో సెక్షన్ 5 ప్రకారం పునర్విభజన పూర్తి అయిన తర్వాతే రిజర్వేషన్ అమలు చేయాలి. కానీ ఇప్పుడు దానికి ముందే అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. కేంద్రం ఈ సవరణ బిల్లును తీసుకొస్తోంది. ఇది ఆర్టికల్ 368(2) ప్రకారం ఉభయ సభల్లో మెజారిటీ మరియు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల ఆమోదం కావాలి. ఇది సాధారణ బిల్లు కాదు, రాజ్యాంగ సవరణ కాబట్టి ఈ నియమాలు తప్పనిసరి. కాబట్టి కేంద్రం ఈ సవరణను జాగ్రత్తగా తీసుకొస్తోంది. ఇది అమలైతే మహిళల రిజర్వేషన్ వెంటనే అమలులోకి వస్తుంది. ఇలాంటి సవరణలు దేశ అభివృద్ధికి సహాయపడతాయి.

**బీజేపీకి ప్రతిపక్షాల మద్దతు ఎందుకు కావాలి?**

లోక్‌సభలో బీజేపీకి 240 ఎంపీలు, రాజ్యసభలో 103 మంది మాత్రమే ఉన్నారు. రాజ్యాంగ సవరణకు ఒక్క సభలోనూ మెజారిటీ లేదు. కాబట్టి ప్రతిపక్షాల మద్దతు తప్పనిసరి. ఇది కాంగ్రెస్, ఇతర పార్టీలతో చర్చలు చేయాల్సిన అవసరం ఉంది. కేంద్రం ఈ విషయంలో అన్ని పార్టీలను ఒప్పించాలని ప్రయత్నం చేస్తోంది. ఈ సవరణ అమలైతే మహిళలకు మేలు జరుగుతుంది కాబట్టి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి. ఇది దేశ ప్రజలందరి హక్కు సంబంధిత విషయం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రానికి ఒక ముఖ్యమైన లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలు విధానాలు, కార్యాచరణ ప్రణాళికపై అన్ని పార్టీలతో చర్చించాలని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశం ద్వారా అన్ని సందేహాలు తీర్చి ఒక ఏకాభిప్రాయం తీసుకోవచ్చు. ఖర్గే గారి ఈ విజ్ఞప్తి చాలా ముఖ్యం. ఎందుకంటే రాజ్యాంగ సవరణకు అన్ని పార్టీల మద్దతు కావాలి. ఇది మహిళల హక్కుల కోసం జరిగే చర్చ అని ఆయన అన్నారు. కేంద్రం ఈ సమావేశాన్ని త్వరగా నిర్వహించాలని ఆశిస్తున్నారు.



**కొత్త చట్టం అమలు తర్వాత ఏమవుతుంది?**

ఈ చట్టం అమలైతే లోక్‌సభలో మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. రాష్ట్ర శాసనసభల్లో కూడా 33 శాతం రిజర్వేషన్ వర్తించాలి. ఇది గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహిళలు రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడానికి దోహదపడుతుంది. ఇప్పుడు మహిళలు ఎన్నికల్లో పోటీ పడినా గెలుపు అవకాశాలు తక్కువ. కానీ రిజర్వేషన్ వల్ల వారికి సీట్లు ఖచ్చితంగా వస్తాయి. దీంతో వారు తమ గ్రామాలు, ప్రాంతాల సమస్యలు పార్లమెంట్‌లో లేవనెత్తగలరు. ఉదాహరణకు మహిళల విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు, భద్రత వంటి విషయాల్లో కొత్త చట్టాలు రావచ్చు. ఇది దేశ సమాజాన్ని మార్చేస్తుంది.

**ఈ మార్పు రాజకీయ పార్టీలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది?**

ప్రతి పార్టీలు ఇప్పుడు మహిళలకు టిక్కెట్లు ఇవ్వడంలో ఎక్కువ శ్రద్ధ చూపించాలి. బీజేపీ, కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ పార్టీలు మహిళల నాయకులను పెంచాలి. ఇది పార్టీల లోపల కొత్త నాయకత్వం ఏర్పడడానికి సహాయపడుతుంది. ఇంకా ఎన్నికల సమయంలో మహిళల ఓట్లు ఎక్కువగా వస్తాయి. ప్రజలు మహిళల నాయకత్వాన్ని ఆమోదిస్తారు. ఇది దేశ రాజకీయాలను మరింత బలంగా చేస్తుంది. కానీ కొత్త సీట్ల విభజనలో కొన్ని రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు. ఇలాంటి మార్పులు దేశ సమతుల్యాన్ని కాపాడాలి.

# దానం నాగేందర్ కు హైకోర్టు నోటీసులు..!

మొదటిపేజీ తరువాయి

వేసింది. బీజేపీ ఎమ్మెల్యే నేత మహేశ్వర్ రెడ్డి దానం నాగేందర్‌పై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన నాగేందర్, తరువాత కాంగ్రెస్‌లో చేరడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ తరపు వాదనలు వినిపించాయి. వెంటనే ఆయనపై అనర్హత వేటు వేయాలని కోర్టును కోరారు.

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, దానం నాగేందర్ పార్టీ మారలేదని.. ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నారని ముందుగా తీర్పు ఇచ్చారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మహేశ్వర్ రెడ్డి కోర్టును ఆశ్రయించారు. విచారణలో భాగంగా, స్పీకర్ తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, ఫిరాయింపుల అంశంపై గతంలో సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పులను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. మరోవైపు పిటిషనర్ తరపు న్యాయవాది, ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేయడం స్పష్టమైన ఫిరాయింపేనని వాదించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు దానం నాగేందర్‌కు నోటీసులు జారీ చేసింది.



# ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ బీఆర్ఎస్ ప్రైవేట్ మెంబర్ బిల్లు

మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు.

అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మానిక్‌రావు, దాసోజ్ శ్రవణ్‌కుమార్ , శంభీపూర్ రాజు, మాదవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.





## నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం అయినా గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే మా లక్ష్యం.

- **మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మి రామానంద్**

**నర్సంపేట మార్చి 23(ప్రజాక్షేత్రం):**

నర్సంపేట మున్సిపాలిటీలో విలీన గ్రామమైన మాదన్నపేట 1వ వార్డును మున్సిపల్ యంత్రాంగంతో మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ & వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా మరియు స్థానిక వార్డు కౌన్సిలర్ కొత్తకొండ మేఘన శ్యామ్ రాజు సందర్శించారు.1వ వార్డు లోని పల్లె దవాఖాన,అంగన్వాడి స్కూల్ ,డంపింగ్ యార్డ్,మహిళా సంఘం బిల్డింగ్,నర్సరీ, క్రీడా ప్రాంగణం,పల్లె ప్రకృతి వనం,నీటి సరఫరా వాటర్ ట్యాంక్ మట్టి రోడ్లును, డ్రైనేజ్ వ్యవస్థను వారు పరిశీలించారు. ప్రజా పాలన ప్రగతి ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరిస్తామని,విలీనమైన గ్రామ ప్రజల ఫిర్యాదులను పరిష్కరించేందుకు మరియు పౌర సేవలను సమర్థవంతంగా అందించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందిస్తామని పారిశుధ్యం పట్ల ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామని 1వ వార్డు అభివృద్ధి కోసం కావాల్సిన నిధులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పొన్నాల నరసింహ,1వ వార్డు అధ్యకులు దండు రవి, ఉపాధ్యక్షులు మారుపాక బిక్షపతి,వార్డు నాయకులు దుర్గా రావు,గంగుల మునిందర్,యూత్ నాయకులు ఆకుల ప్రశాంత్,ఎండి అజీమ్,కేశెట్టి పవన్ ,మున్సిపల్ అధికారులు పోల్లబోయిన శ్రీనివాస్,నల్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## కుటుంబ సమేతంగా కొమ్మల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**గీసుగొండ మార్చి 23(ప్రజాక్షేత్రం):**

వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మల గ్రామం లో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సతీమణి శాలిని కూతురు అనన్య శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు .ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఘన స్వాగతం పలికారు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు అర్చకులు ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఎల్లప్పుడూ ప్రజలు ఉండాలని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కోరినట్టు తెలిపారు.



## డాక్టర్ జానకి రాముకు ప్రతిభా పురస్కారం

**చిన్న చింతకుంట మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

చిన్న చింతకుంట మండలం బండర్ పల్లి గ్రామానికి చెందిన డాక్టర్ జానకిరామ్ ప్రతిభపురస్కారం దక్కింది. హైదరా బాద్ లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ లో ముదిరాజ్ ప్రగతి భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ప్రతిభా పురస్కార అభినందన వేడుకలలో డాక్టర్ జానకిరామ్ కు విశిష్ట సేవలకు గుర్తిం పుగా ప్రతిభా పురస్కారం అందుకున్నారు. తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్,ఎమ్మెల్సీ బండ ప్రకాష్,తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా ఈ ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు.ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్,మాజీ మంత్రి పి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



## సాయిసుధీర్ కళాశాలలో 'ట్రైఇంపాక్ట్–సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



- **విద్యార్థుల్లో పరిశోధనాసక్తి పెంపే లక్ష్యం**
- **ప్రముఖుల సమక్షంలో అవగాహన ఒప్పందం**

**ఈసీఐఎల్,మార్చి 23(ప్రజాక్షేత్రం):**

కాప్రా సర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ లోని సాయిసుధీర్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో 'ట్రైఇంపాక్ట్-సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' క్లబ్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు.రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.విద్యార్థుల్లో పరిశోధనాభిలాషను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు వినూత్నంగా ఉన్నాయని ప్రశంసించారు. సాంప్రదాయ విద్యతో పాటు పరిశోధన,ఆవిష్కరణలపై దృష్టి సారిస్తేనే భవిష్యత్తులో విజయాలు సాధ్యమని సూచించారు.ఎక్కువ మంది విద్యార్థులు రిసెర్చ్ రంగంలోకి వచ్చి తమ ప్రతిభను నిరూపించాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.బాలభాస్కర్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో పరిశోధనకు ప్రాధాన్యత పెరుగుతోందని తెలిపారు. ట్రైఇంపాక్ట్ కేంద్రం విద్యార్థులకు నూతన అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు.ప్రత్యేక అతిథి కొనకల్ల సూర్యప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ పరిశోధన,స్టార్టప్, ఇన్నోవేషన్ రంగాల్లో విద్యార్థులు ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్‌మెంట్,రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) పత్రాలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు





పరిశోధన,శిక్షణ,పారిశ్రామిక అనుభవం వంటి రంగాల్లోసహకారం అందించనున్నట్లుతెలిపారు. కార్యక్రమంలో ట్రైఇంపాక్ట్ క్లబ్‌కు చెందిన విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించి అతిథులను ఆకట్టుకున్నారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్,సామాజిక సమస్యల పరిష్కారాలకు సంబంధించిన పలు ప్రాజెక్టులు ప్రత్యేకంగా నిలిచాయి. ప్రిన్సిపాల్ డా.మీరారాణి ఆధ్వర్యంలో,ప్రొఫెసర్ ఎల్. పద్మ పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపాల్ మోహన్ బాబు,వివిధ విభాగాల హెచ్ఓడీలు,అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## రిజిస్ట్రేషన్ ఆఫీసులో సౌకర్యాల లేమి.

- **ఫ్యాన్ ఊడి పడి మహిళకు గాయం**

**మహబూబ్ నగర్ జిల్లా మార్చి 23(ప్రజాక్షేత్రం):**

మహబూబ్నగర్ లో రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయంకు వచ్చిన మహిళపై ఫ్యాన్ ఊడి పడటంతో గాయాలయ్యాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కనీస వసతులు లేక రిజిస్ట్రేషన్ కొరకు వచ్చే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయంకు వచ్చిన ఒక మహిళపై సీలింగ్ ఫ్యాన్ ఊడి పడి గాయాల పాలైన సంఘటన సోమవారం జరిగింది. రిజిస్ట్రేషన్ నిమిత్తమై కార్యాలయంకు వచ్చిన ఒక మహిళ బయట వరండాలోని రేకుల షెడ్డులో బెంచీపై కూర్చొని నిరీక్షిస్తూ ఉండగా, ఆఫీస్ సిబ్బంది ఒకరు వచ్చి సీలింగ్ ఫ్యాన్ స్విచ్ వేసి వెళ్లిపోయాడు. ఫ్యాన్ వేగం అందుకున్న కొద్దిసేపటికి ఊడి పడి అక్కడే కొద్దిగ పక్కకు కూర్చున్న ఒక మహిళా భుజంపై ఫ్యాన్ బ్లేడ్ బలంగా పడి గాయం అయ్యింది. సరిగ్గా ఫ్యాన్ కింద ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. రోజూ వందకు పైగానే రిజిస్ట్రేషన్ నిమిత్తమై కార్యాలయంకు వచ్చి గంటల తరబడి నిరీక్షించే వినియోగదారులకు కూర్చోవడానికి సరిపోను కుర్చీలు, మంచినీటి సౌకర్యం,మహిళలకు టాయిలెట్లు లేవు.రిజిస్ట్రేషన్ చార్జీలు మాత్రం భారీగా వసూలు చేస్తున్నా వినియోగదారులకు కనీస వసతులు కల్పించడం లేదని పలువురు పెదవి విరుస్తున్నారు. వెంటనే కనీస సౌకర్యాలు కల్పించాలని రిజిస్ట్రార్ను కోరుతున్నారు.




## పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి.

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**
- **మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు.**

**వనపర్తి,మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను ఎటువంటి అవకతవకలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు ఆదేశించారు. సోమవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును, విద్యార్థుల కూర్చొనే విధానాన్ని, పర్యవేక్షణ చర్యలను స్వయంగా పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ విచారణ చేయగా, మొత్తం 251 మంది విద్యార్థులకు గానూ ఆంగ్ల పరీక్షకు 250 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి నుంచి విద్యార్థికి కనీస దూరం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులపై కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించి, మాల్ ప్రాక్టీస్‌కు ఎలాంటి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని,ఎటువంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని,పరీక్షా కేంద్ర సిబ్బంది,ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## లారీ డ్రైవర్ నిర్లక్ష్యం... వ్యక్తి మృతి

**కీసర,మార్చి 23(ప్రజాక్షేత్రం):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. చెత్త లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఈ ప్రమాదానికి కారణమైంది. పోలీసుల వివరాల ప్రకారం... బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన రవీందర్ (54) ఆదివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కీసర ఔటర్ రింగ్ రోడ్ సమీపానికి చేరుకున్న సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన చెత్త లారీ అతని బైక్‌ను ఢీకొట్టింది. ఢీకొట్టిన ప్రభావంతో రవీందర్ రోడ్డుపై పడిపోవడంతో లారీ వెనుక చక్రాల కింద పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కీసర పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో మల్యాల గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఘటన అనంతరం వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడని సమాచారం. పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కీసర పోలీసులు తెలిపారు.



## భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ చట్టం చేయాలి

- **ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్**
- **మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి**

**వలిగొండ మార్చి 23(ప్రజాక్షేత్రం):**

వలిగొండ మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీసిపిఐ, అఖిలభారత యువజన సమాఖ్యఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి కూడలి వద్ద కామ్రేడ్ మారోజు నరసింహ చారి అధ్యక్షతన భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95 వర్ధంతి ఘన నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సరిగంజి వీరస్వామి మాట్లాడుతూ భగత్ సింగ్ చిన్న వయసులోనే తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశం కోసం ప్రాణాలను అర్పించడం జరిగినది అని అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ బ్రిటిష్‌కు వ్యతిరేకంగా ఉద్యమించి ఈ దేశ స్వతంత్రం కోసం ఉరికంబన్నీ ముద్దాడిన ఈ గొప్ప స్వాతంత్ర పోరాట యోధులు భగత్ సింగ్ రాజు గురు సుఖ్ దేవులు అని అన్నారు. వారి ఆలోచన విధానాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని అన్నారు.యువత చెడుదారులకు గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు అదేవిధంగా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ చట్టం చేసి పార్లమెంట్లో బిల్లు పెట్టి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శీలం స్వామి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పాల్గొని మాట్లాడుతూ భగత్ సింగ్,రాజు గురు, సుఖ్ దేవ్ ల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ఈ సమాజం కోసం పనిచేయాలని, అదేవిధంగా ఈ దేశ రాజకీయాల్లోకి యువత రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు పోలేపాక యాదయ్య, పులిపల్పుల మల్లేశం, గుండెగాని నాగరాజ్,కట్ల యాదగిరి,మచ్చ లక్ష్మీనారాయణ, కనకబోయిన ఆంజనేయులు, తాలూకా యాదగిరి,కనకబోయిన నందు, తదితరులు పాల్గొన్నారు.





## ప్రజావాణిలో భూ వివాదాలపై వనపర్తి ఎస్పీ రజిత రెడ్డి

- **కీలక సూచన.**
- **పోలీసు జోక్యం పరిమితం... కోర్టుల ద్వారానే శాశ్వత పరిష్కారం.**
- **ప్రజావాణితో ప్రజలకు చేరువలో పోలీసు శాఖ.**

**వనపర్తి,మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

భూ వివాదాల విషయంలో పోలీసుల జోక్యం పరిమితమని, అలాంటి సమస్యలకు కోర్టులే సరైన వేదిక అని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణిలో మొత్తం 12 ఫిర్యాదులు అందాయన్నారు.ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. ముఖ్యంగా భూ సంబంధిత వివాదాలు సివిల్ స్వభావం కలిగినవిగా ఉండటంతో, వాటిని కోర్టుల ద్వారా పరిష్కరించుకోవడం ద్వారా శాశ్వత న్యాయం లభిస్తుందని సూచించారు. ప్రజలు చట్టబద్ధ మార్గాలను అనుసరించడం అత్యంత ముఖ్యమని, భూ వివాదాల వంటి అంశాల్లో తొందరపడి పోలీసులను ఆశ్రయించడం కంటే న్యాయస్థానాలను ఆశ్రయించడం ఉత్తమమన్నారు. అయితే మోసపూరిత చర్యలు, బెదిరింపులు వంటి అంశాలు ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల భద్రత, న్యాయం తమ ప్రధాన బాధ్యతలని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా పారదర్శకంగా, వేగవంతంగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సోమవారం వచ్చిన ఫిర్యాదుల్లో భార్యభర్తల మధ్య వివాదాలు - 4 భూ తగాదాలు - 7 పరస్పర గొడవలు - 1 తది తర ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు.



## అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు

- **నాచారం సర్కిల్లో అక్రమ భవనాల దూకుడు**
- **సెట్ బ్యాక్, పార్కింగ్ లెక్కచేయని నిర్మాణాలు**
- **మల్లాపూర్ డివిజన్ లో చోద్యం చూస్తున్న అధికారులు**

**నాచారం,మార్చి 23(ప్రజాక్షేత్రం):**



నాచారం సర్కిల్ పరిధిలోని మల్లాపూర్ డివిజన్లో బ్యాంక్ కాలనీ, సూర్యనగర్ కాలనీలలో అనుమతి నిబంధనలు ఉల్లంఘిస్తూ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి భవన నిర్మాణాలకు తీసుకున్న పర్మిషన్లు ఒక విధంగా ఉండగా,స్థలంలో నిర్మాణాలు మాత్రం పూర్తిగా భిన్నంగా జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. భవన నిర్మాణాలకు తప్పనిసరిగా ఉండాల్సిన సెట్బ్యాక్ లు, పార్కింగ్ సౌకర్యాలు వంటి నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి ఇష్టం వచ్చినట్లుగా నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీ వాసులు తెలిపారు.కొంతమంది భవన యజమానులు రోడ్డు వరకు నిర్మాణాలు చేపట్టి,వాహనాల పార్కింగ్కు కూడా ఎలాంటి స్థలం వదలకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతో కాలనీల్లో రహదారులు ఇరుకుగా మారి వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. అదేవిధంగా భవనాలకు మంజూరు చేసిన అంతస్తుల కంటే ఎక్కువ అంతస్తులు నిర్మిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.అయినప్పటికీ మున్సిపల్ డీసీ,ఏసీపీ, చైనామ్యాన్,టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఈ అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని వారు తెలిపారు.ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను నిలిపివేసి ,నిబంధనలు ఉల్లంఘించిన భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



# జర్నలిస్టులపై దాడి సమాజానికి ప్రమాదం

- **జర్నలిస్టులపై దాడికి పాల్పడినవారిని రిమాండ్ చెయ్యాలి**
- **చేవెళ్ల ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన ఎం.జే.ఎఫ్ నాయకులు**
- **రాజకీయ ఒత్తిళ్లతోనే పోలీసుల జాప్యం**
- **జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి**
- **ఎంజేఎఫ్ చేవెళ్ల డివిజన్ కన్వీనర్ మహేష్ ఆశిగారి.**

**చేవెళ్ల మార్చి 23(ప్రజాక్షేత్రం):**

షాబాద్ మండలంలో దళిత జర్నలిస్టులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చెయ్యాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఎంజేఎఫ్ (మాదిగ జర్నలిస్ట్ ఫోరం) చేవెళ్ల డివిజన్ కన్వీనర్ మహేష్ ఆశిగారి జర్నలిస్టులతో కలిసి చేవెళ్ల ఆర్డీవో పార్థ సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని,వాస్తవాలను వెలుగులోకి తెచ్చే కలం సైనికులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం,సమాజంపై ఉందని ఆయన అన్నారు.క్షేత్రస్థాయిలో వార్తలు సేకరించే రిపోర్టర్లపై భౌతిక దాడులు ,బెదిరింపులు,ఆన్లైన్ వేధింపులు పెరిగిపోతున్నాయని, ఇదే కోణంలో షాబాద్ మండలంలో దళిత జర్నలిస్టులపై దాడి జరిగిందని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి 20 రోజులు కావస్తున్న నిందితులను రిమాండ్ చెయ్యకుండా రాజకీయనాయకులకు పోలీసులు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. అధికారులు కేసు పురోగతిలో కాలయాపన చేస్తుండటంతో నిందితులు సాక్షులను, ఆధారలను తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. జర్నలిస్టులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. అంతే కాకుండ విధినిర్వహణలో ఎన్నో కష్టాలకోర్చి అనేక వాస్తవిక స్థితిగతుల సమాచారాన్ని ప్రజలకు చేరవేసే జర్నలిస్టులకు సమాజంలో ఎంతో గౌరవం ఉంటుంది. కానీ అదేస్థాయిలో వారు ఎన్నో ఒత్తిళ్లను తట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.విధినిర్వహణలో భాగంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి నిగ్గు తేల్చే నిజాలను ప్రజల ముందుంచుతారు. అలాంటి జర్నలిస్టులపై బెదిరింపులు,నిర్బంధాలు, దాడులు,అపహరణ,హత్యలు లాంటి సంఘటనలు పెరిగిపోతున్నాయని,ఇలాంటి దాడులను ప్రతి ఒక జర్నలిస్టు ఖండించి,మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కో.కన్వీనర్ నర్సాని రమేష్,జర్నలిస్టులు నరేందర్, అమర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## అసెంబ్లీ ముట్టడికి వచ్చిన బీజేపీ నేతల అరెస్టు.

- **వనపర్తి జిల్లా నాయకులు పోలీసుల అదుపులోకి.**
- **హామీలు అమలు చేయాలంటూ బీజేపీ ఆందోళన.**
- **ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు.**

**వనపర్తి,మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోరుతూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి దిగిన బీజేపీ నాయకులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్ర రావు పిలుపు మేరకు వనపర్తి జిల్లా నాయకులు పక్కా వ్యూహంతో అసెంబ్లీ సమీపానికి చేరుకోగా, పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అనంతరం ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బందించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, "420 హామీలు" ఇప్పటికీ అమలు కాలేదని తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన 27 నెలలు గడిచినా మహిళలు, నిరుద్యోగులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు అందరినీ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల తరపున బీజేపీ పెద్ద ఎత్తున అసెంబ్లీ ముట్టడి పిలుపునిచ్చిందని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి ప్రతిపక్షాలను అణిచివేయడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ప్రజా ఉద్యమాలను అడ్డుకునే ప్రయత్నాలు విఫలమవుతాయని, హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. అవసరమైతే మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు ఆందోళనలు చేపట్టే అవకాశముందని తెలిపారు. అసెంబ్లీ ముట్టడిలో మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి,ఎస్.రామచంద్ర రెడ్డి,పెద్దిరాజు,సంజీవరెడ్డి, నలబోతుల అరవింద్,అంజి యాదవ్,ఆగపోగు చాణుక్య, చంద్రశేఖర్,వరుణ్ కుమార్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.




## గీత పరిశ్రమిక సహకార సంఘం లో అవినీతి దిశగా ఇద్దరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**కోటగిరి మార్చి 23(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇద్దరు వ్యక్తులు అవినీతికి పాల్పడుతున్నారని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వీరికి చట్టపరమైన శిక్ష వేయాలని గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో అవినీతిగా నిలిచిన వారిపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘ సభ్యులకు కోరుతున్నారు.కోటగిరి గీత పారిశ్రమ సహకార సంఘం లో అవినీతికి పాల్పడుతున్న డి సాయ గౌడ్ డి శ్రీధర్ గౌడ్ పై అధికారులు చట్టరీత్యా చర్య తీసుకోవాలి టిసిఎస్ అధ్యక్షులు డి శంకర్ గౌడ్ డిమాండ్ ఈరోజు కోటగిరి మండల కేంద్రంలో ఎస్ ఫంక్షన్ హాల్ లో కోటగిరి గీత పరిశ్రమ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది ఈ ప్రెస్ మీట్ ని ఉద్దేశిస్తూ టిసిఎస్ అధ్యక్షులు డి శంకర్ గౌడ్ మాట్లాడుతూ కోటగిరి సహకార సంఘం గ్రూపు సొసైటీ రిజిస్ట్రేషన్ నెంబర్ 242 గల గ్రూప్ సొసైటీలో 60 కల్లుగీత కార్మికు లా కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారు గత రెండు సంవత్సరాల నుండి కోటగిరి డిపో మేనేజ్మెంట్ గా డి సాయ గౌడ్ క్యాషియర్ గా డి శ్రీధర్ గౌడ్ కొనసాగుతున్నారు కోటగిరి డిపో జమ ఖర్చులు లెక్కలు ఇలాంటి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు గత రెండు సంవత్సరాల నుండి లక్షల రూపాయలు దోచుకొని దాచుకుంటున్నారు షేర్ పార్టనర్లకు లెక్కలు చెప్పకుండా అడిగిన వారిపై దౌర్జన్యం చేస్తూ ఇటు గీత కార్మికుల అటు సొసైటీ సభ్యులకు విభజించి పాలిస్తున్నారు చీమలన్నీ పుట్ట పెట్టుకుంటే అందులో విష నాగులు పండుకున్నట్టుగా తండ్రి కొడుకులు కల్లు సొసైటీ నీ చేతిలో తీసుకొని ఇష్టరాజంగా పాలిస్తున్నారు అవినీతికి పాల్పడుతూ రాజ్యమేలుతున్నారు నష్టాలు లాభాలు చూపించకుండా సొసైటీ సభ్యులకు డబ్బులు పంచకుండా రోజు వారీగా వచ్చిన డబ్బులతో విలాసమైన జీవితాలు గడుపుతున్నారు అవినీతికి పాల్పడుతున్న తండ్రి కొడుకుల పై చట్ట రిత్యా చర్య తీసుకోవాలని ఈ విషయంపై నిజాంబాద్ జిల్లా ఎక్సైజ్ సూపర్డెంట్ గారికి లిఖితపూర్వంగా ఫిర్యాదు చేస్తామని అన్నారు ఈరోజు నుంచి కోటగిరి గీత పరిశ్రమ సహకార సంఘం గ్రూపు సొసైటీ నీ పాలకవర్గం ద్వారా కొనసాగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు.ఏ. విఠల్ గౌడ్,టి సి ఎస్ ఉపాధ్యక్షులు.ఆర్.అరుణ్ కుమార్ గౌడ్,కార్యదర్శి. ఎస్.సాయి బాబా గౌడ్,గౌడ సంఘం నాయకులు. ఆర్.శ్యామ్ సుందర్ గౌడ్,ఆర్.



## బీసీలకు అన్యాయం చేసిన బడ్జెట్.. టీఆర్‌పీ విమర్శలు

- **ఈసీఐఎల్ చౌరస్తాలో టీఆర్‌పీ ధర్నా**

**కాప్రా,మార్చి 23(ప్రజాక్షేత్రం):**


తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించలేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాప్రా సర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ చౌరస్తాలో సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో చౌరస్తా మార్మోగింది. ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరి శంకర్ గౌడ్ విమర్శించారు. బీసీల సంక్షేమానికి ఏటా రూ.20,000 కోట్లు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ అంశాన్ని ప్రస్తావించకపోవడం వంచనకే నిదర్శనమన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని జిల్లా అధ్యక్షుడు పనగట్ల చక్రపాణి గౌడ్ డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం,నిరుద్యోగ భృతికి తగిన నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తక్షణమే సవరించిన బడ్జెట్‌లో బీసీలకు న్యాయం చేయాలని,లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని జిల్లా యువజన అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ నీ అందించిన సర్పంచ్

**ఖానాపురం మార్చి 23(ప్రజాక్షేత్రం):**

ఖానాపూర్ మండల బుధరావుపేటగ్రామంలో ఎనిమిది మందికి బాధిత కుటుంబాలకు చెక్కులు అందించడం జరిగినది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెసరు రాణి గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా చెక్కులు బాధ్యత కుటుంబాలకు చెక్కులు అందించారు సుమారు రెండు లక్షల 20వేల రూపాయల చెక్కులను అందించారు గ్రామ సర్పంచ పెసరు రాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిత్యం బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తుందని బాధిత కుటుంబాలని ఎల్లప్పుడూ ఆదుకుంటాది పేద ప్రజలకి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంట ప్రజల క్షేమమే ప్రభుత్వ క్షేమమని సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆశయం పేదవాడికి ఎలాంటి కష్టం వచ్చినా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు . సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుని అందుకున్న కుటుంబాలు 1.బండి స్వప్న 49,000/ 2.నాసం.ఉప్పలయ్య 10,000/ 3.షేక్ హుస్సేన్ బీ 27,000 /. 4.మారు పెద్దిసందీప్ 17,000/ 5.జటంగి అశోక్ 34,000/ 6.వల్లెపు రేణుక 15,500/ 7.ముత్యాల రాకేష్ 48,000/ 8.శేరి రామకృష్ణ 20,000/ అందుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు లింగిడి వెంకటేశ్వర్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గిరగాని నరసయ్య వార్డ్ మెంబర్లు గారే అనూష రవి,మండలకిసాన్ సెల్ అధ్యక్షులు చెడిపాక ఉపేందర్,గ్రామ ఉపాధ్యక్షులు చెడిపాక యాకయ్య గ్రామ ప్రధాన కార్యదర్శి సమ్మన్న మాజీ గ్రామ పేట అధ్యక్షులు షేక్ చాంద్ పాషా మారగాని లింగయ్య స్పెషల్ మీడియా అధ్యక్షుడు కోడి మల్లేశం సహాయ కార్యదర్శి చంద్ర ప్రకాష అక్రమ్ మరియు సీనియర్ నాయకులు చేతుల మీదుగా సీఎం ఫండ్ చెక్కును వారికి అందజేయడం జరిగినది.



# బీసీలకు 'మొండిచేయి'..బడ్జెట్‌పై టి.ఆర్.పీ ఆగ్రహం




**వనపర్తి,మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందంటూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టి.ఆర్.పీ) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నమ్మకద్రోహం చేసిందని టి.ఆర్.పీ యూత్ జిల్లా అధ్యక్షుడు జి. రవికుమార్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుత బడ్జెట్ కేవలం అంకెల గారడిగా మారిందని, బీసీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం 6 శాతం నిధులు కేటాయించడం సామాజిక న్యాయానికి విరుద్ధమని పేర్కొన్నారు. బీసీ సబ్‌ప్లాన్ అమలు చేసి చట్టబద్ధత కల్పించాలని, 42 శాతం రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ధన దుర్వినియోగంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిరసనల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# అగ్నికి ఆహుతైన ఇళ్లు... గిరిజన కుటుంబాలు వీధిపాలయ్యాయి

**అశ్వారావుపేట,మార్చి 23(ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త నారవారి గూడెంలో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు చెలరేగిన అగ్నిప్రమాదంలో రెండు గిరిజన కుటుంబాలకు చెందిన ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంట్లో ఉన్న సామగ్రి, బట్టలు, ధాన్యం సహా అన్ని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఘటనతో బాధిత కుటుంబాలు నిస్సహాయ స్థితిలో మిగిలిపోయాయి. తలదాచుకునే చోటు లేక, కనీస అవసరాలు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. బియ్యం, కూరగాయలు, బట్టలు తదితర అవసరమైన వస్తువులు అందించాలని కోరుతున్నారు.



□ సంప్రదించవలసిన వారు: తంబళ్ల రవి - 9848323871



# ఆత్మకూరులో షహీద్ భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు

**మక్తల్ మార్చి 23(ప్రజాక్షేత్రం):**

భగత్ సింగ్ కలలుగన్న సమాజం కోసం నేటి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు గాంధీ చౌరస్తాలో సోమవారం షాహిద్ భగత్ సింగ్ 95వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కుతుబ్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశంలో నేటి యువత డ్రగ్స్ కు నేరాలకు అలవాటు పడి చెడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు భగత్ సింగ్ చిన్న వయసులో బ్రిటిష్ పార్లమెంటుపై బాంబు వేసి ఈ దేశనుడి ప్రాణదారి ఎందుకు కృషి చేస్తే నేటి యువత రాజకీయ నాయకుల ఉచ్చులో పడి మత్తుకు బానిస అవుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు యువతను ఉపాధి కల్పించక యువత పెడదోవ పట్టేందుకు ప్రభుత్వాలు ఒక కారణమని ఆరోపించారు. యువతకు ఉపాధి కల్పించాలని తద్వారా యువత సమాజం గురించి ఆలోచన చేసేందుకు సమయం దొరుకుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అభి అరవింద్ కవి రాజ్ మైబు అమీర్ వసీం రమేష్ పాల్గొన్నారు.



# "జీరో అనుమతులతో భవనాలు...టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం పాటిస్తున్నారా?"




- **"G+4 అక్రమాలకు గ్రీన్ సిగ్నల్...టౌన్ ప్లానింగ్ అధికారులు ఎక్కడ?"**
- **జీరో అనుమతులతో జోరుగా నిర్మాణాలు....దుండిగల్ అధికారుల 'మౌనానికి' అర్థమేంటి?"**
- **పేదలపై కఠిన చర్యలు... పెద్దల అక్రమాలకు కళ్లెదుటే మన్నింపు? గండి మైసమ్మ సర్వే నెం.168లో నిర్మాణాల దుమారం**

**కుత్బుల్లాపూర్,మార్చి 23 (ప్రజాక్షేత్రం)**

దుండిగల్ సర్కిల్ పరిధిలో గండి మైసమ్మ సర్వే నంబర్ 168లో జీరో అనుమతులతో భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. అధికారిక అనుమతులు లేకుండానే G+4, స్థాయిలో భవనాలు నిర్మించబడుతున్నా,టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం స్థానికులకు అద్దంలా కనబడుతుంది. ఇప్పటికే పలు వార్తాపత్రికల్లో అక్రమ నిర్మాణాలపై కథనాలు వెలువడినా, సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. "తెలుసు కానీ చేయం" అన్నట్టుగా అధికారుల వ్యవహారం కనిపిస్తోందని స్థానికులు మీడియాకు చెప్పుకొచ్చారు. ఒక పేదవాడు చిన్నగా G+2 పెంట్ హౌస్ నిర్మిస్తే వెంటనే అక్కడికి చేరుకుని అనుమతులపై ప్రశ్నల వర్షం కురిపించే టౌన్ ప్లానింగ్ అధికారులు, పెద్ద స్థాయిలో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాలపై మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. పేదలకు ఒక న్యాయం... పెద్దలకు మరో న్యాయం అన్నట్టుగా అధికారుల వైఖరి ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక అధికారుల ప్రమేయం ఉందా? లేదా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చర్యలు తీసుకోవడం లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అక్రమ నిర్మాణాల పైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.







# జోరుగా గ్యాస్ సిలెండర్ల బ్లాక్ దందా.

- **జోరుగా గ్యాస్ సిలెండర్ల బ్లాక్ దందా.**
- **ఒక సిలెండర్ రూ.2500**

**కామారెడ్డి జిల్లా మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో గ్యాస్ సిలెండర్ల బ్లాక్ దందా జోరుగా నడుస్తుంది. ఒక సిలెండర్ 2500 రూపాయలకు అమ్ముతున్నారు. ఎవరికి తెలియనట్టు సిలెండర్ సీల్ తీసి వేరే ఎంప్టీ సిలెండర్లో సగం నింపి 2500 రూపాయలకు అమ్ముతున్నారు. ఖాళీ సిలెండర్లు ఉన్నట్టు సీల్ తీసేసి దందా నడిపిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంగమేశ్వర కాలనీలో సిలెండర్ సీల్ తీసేసి ఖాళీ సిలెండర్లో గ్యాస్ నింపుతుండగా.. స్థానికులు చూసి వెంబడించగా ఆటోతో ఆక్సిడెంట్ చేసి నడి రోడ్డుపై ఆటోను విడిచి డ్రైవర్ పారిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పోలీసులు వచ్చి ఆటోను పోలీస్ స్టేషన్కు తరలించారు. గ్యాస్ సిలెండర్లు నిజాంసాగర్ నుండి బాన్సువాడకు తరలించి అమ్ముతున్నట్లు స్థానికులు చెప్తున్నారు. ప్రజలకు గ్యాస్ కొరత లేకుండా చూడాల్సిన అధికారులు గత కొన్ని రోజులుగా ఈ వ్యవహారం నడుస్తున్న సివిల్ సప్లై అధికారులు నామ మాత్ర తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత

- **కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ కలెక్టరేట్,మార్చి23 (ప్రజాక్షేత్రం):**

ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 233 మంది అర్జీదారులు తమ సమస్యలను వినిపిస్తూ దరఖాస్తులు సమర్పించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగతా దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. పెండింగ్‌లో ఉంచకుండా ప్రతి దరఖాస్తుపై వేగంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్,ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల పూర్తి వేగవంతం చేయాలి

- **సర్పంచ్ మార్క రాజ్ కుమార్**

**చిగురుమామిడి,మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మార్క రాజ్ కుమార్ మాట్లాడుతూ, ఇండ్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన మంత్రి పొన్న ప్రభాకర్ సూచనల మేరకు ప్రతి లబ్ధిదారు తమ ఇళ్ల ఆవరణలో కనీసం ఐదు మొక్కలు—మునగ, నిమ్మ, కరివేపాకు, జామ, ఉసిరి—నాటాలని సూచించారు. అలాగే మార్చి నెలాఖరు లోపు అన్ని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి గ్రామపంచాయతీ నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. మండలంలోనే మొదటగా 16 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి కొండాపూర్ గ్రామాన్ని ఆదర్శంగా నిలపాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన మహిళలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బింగి రాజేంద్రప్రసాద్, వార్డు సభ్యులు గుడాల ఉమా, శనిగరం రాజయ్య, బింగి మాధవి, రెడ్డి అయిలయ్య, బత్తుల అంజమ్మ, బుర్ర తిరుపతి, పైడిపల్లి సుగుణ, పంచాయతీ కార్యదర్శి అమృత వర్షిని,కారోబార్ బింగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# కురవిలో పోలీసుల పేరుతో వసూళ్లు...నిందితుడి అరెస్ట్

**కురవి మార్చి 23( ప్రజాక్షేత్రం):**

మహబూబాబాద్ జిల్లా కొరవి మండలం లో పోలీసులమని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని కురవి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదు దారుడు పులిచింతల శ్రీనివాస్ నుంచి రూ.22,300 దోచుకున్న ఎర్రుపల నాగరాజును అరెస్ట్ చేసి,సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా బాధితుడిని బెదిరించి నగదు, ఫోన్‌పే ద్వారా డబ్బులు తీసుకున్నట్టు గుర్తించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకున్నారు. ఇప్పటికే పలువురిని బ్లాక్‌మెయిల్ చేసిన చరిత్ర ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిర్మానుష ప్రదేశాల్లో ప్రేమికులను టార్గెట్ చేసి 'పోలీసుని' అంటూ డబ్బులు వసూలు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ అధికారుల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కురవి ఎస్సై గండ్రాతి సతీష్ హెచ్చరించారు.



# బడ్జెట్‌లో బీసీలకు న్యాయం ఎక్కడ...?

- ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం.
- కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించింది.
- బీసీలకు న్యాయం చేయాలి.
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జి గాండ్ల సుధీర్ కుమార్ డిమాండ్.



**కామారెడ్డి జిల్లా మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని,ఇచ్చిన మాట కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ( టీఆర్పీ ) బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జి గాండ్ల సుధీర్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. బడ్జెట్‌లో బీసీలకు సరైన కేటాయింపులు చేయకపోవడమే కాకుండా, కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఆయన అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు ప్రతి ఏటా 20,000 కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఈసారి కేవలం ₹12,000 కోట్లకే పరిమితం చేయడం దారుణమని అన్నారు. అదేవిధంగా, బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని చెప్పి అమలు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూపుతోందని విమర్శించారు. రాష్ట్రంలో 60% జనాభా ఉన్న బీసీలకు బడ్జెట్లో కేవలం 6 శాతం నిధులు మాత్రమే కేటాయించారని, 10 శాతం కూడా లేని ఓసీ మంత్రుల చేతిలో 62 శాతం బడ్జెట్ ఉందని, ఇది సామాజిక న్యాయం ఎలా అవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుని బీసీ వర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# అనుమతులు లేకుండా నిర్మిస్తున్న రైస్ మిల్లుల పై చర్యలు తీసుకోవాలి.

- తాసిల్దార్ కు వినతి పత్రం అందజేత.

**పోతంగల్ మార్చి 23(ప్రజాక్షేత్రం):**

మండల కేంద్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రైస్ మిల్లు లు అనుమతులు లేకుండా పార్కింగ్ ప్లేస్, ఎన్ఓసి లేకపోవడం, ఇష్టానుసారంగా రైస్ మిల్లులు కట్టడం ద్వారా ప్రధాన రహదారి గుండా ప్రయాణికులకు యాక్సిడెంట్లు జరిగే అవకాశం ఉందని కొత్తగా నిర్మిస్తున్న రైస్ మిల్లులకు తనిఖీ చేసి అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనేక రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ లో, గ్రామపంచాయతీ సర్పంచ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్, కోటగిరి రుద్రూర్ మండలాల బిజెపి అధ్యక్షుడు నవీన్, హరి, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, సీనియర్ నాయకులు పుల్లెల మోహన్ రావు, నాగేల్లి శ్రీనివాస్, వడ్ల శ్యామ్, మామిడి శ్రీను, గుంజారి జగదీష్, మామిడి సాయిలు, విలాస్ శ్యామ్ బొనిగే ఓమన్న, పటేల్ తదితరులు పాల్గొన్నారు.




# నిరుపేదల మహిళ అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత

- నిరుపేదలకు అండగా ఉంటా కోనేరు శశాంక్

**కోటగిరి మార్చ్ 23(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేసిన బాన్సువాడ బిజెపి ఇన్చార్జ్ కోనేరు శశాంక్ ప్రజలకు అండగా ఉంటా నిరుపేద కుటుంబానికి భరోసా కల్పిస్తూ నిరుపేదలకు అండగా ఉంటా అంటూ భరోసా కల్పించారు కోటగిరి మండల కేంద్రానికి చెందిన గొంటి సాయవ్వ (65) అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా బాన్సువాడ నియోజకవర్గ బిజెపి నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేశారు. మృతురాలి వివరాలు కోటగిరి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు వేముల నవీన్ ద్వారా తెలుసుకున్న కోనేరు శశాంక్ తన కోనేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతక్రియలకు రూ.5000 ఆర్థిక సాయం అందించారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎన్నారై కోనేరు శశాంక్ వారి కుటుంబీకులను కలిసి ఆర్థిక సహాయాన్ని మృతురాలి భర్త రాములకు అందజేశారు. ఈ కార్యక్రమంలో.. బిజెపి మండల అధ్యక్షుడు వేముల నవీన్, నాయకులు మామిడి శ్రీనివాస్, స్థానిక నాయకులు కన్నం శ్రీనివాస్, హస్కుల రవి తదితరులు ఉన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులు, పెండింగ్ ఫైళ్ళను తక్షణమే పరిష్కరించాలి

- అన్ని వసతి గృహాలలో పక్కాగా కామన్ డైట్ మెనూ పాటించే విధంగా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలి
- షెడ్యూల్ ప్రకారం విద్యార్థిని విద్యార్థులు, వంట సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్,

**మహబూబాబాద్ జిల్లా మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్* అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్,క్రిష్ణవేణి లతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ స్వయంగా గూగుల్ మీట్ ద్వారా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి యొక్క వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను, ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి తక్షణమే క్లియర్ చేయాలని, కార్యాలయాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు జవాబుదారీ తరంగా ఉంటూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ ,భోజనం, డిన్నర్ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కొత్తగూడమండలంలోగ్రామపంచాయతీపూర్వ పనుల నిధుల విషయంలో ప్రస్తుత సర్పంచ్ మంజూరైన ఇవ్వడం లేదని ఫిర్యాదు.. తమ సమస్య పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఆవుల పద్మ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినదని అధికారులు తెలియజేయగానే తమకు ఉన్న పాత ఇల్లును కూల్చివేశామని కానీ ఇప్పుడు అది వేరే స్టేజీ లో ఉందని మంజూరు చేయలేదు తమకు పూర్వం ఎటువంటి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని తమ సమస్య పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. మహబూబాబాద్ మండలం శనిగపురం గ్రామానికి చెందిన ఉప్పలయ్య తనకు శనిగపురం గ్రామ శివారులో ఉన్న సర్వే నెంబర్లలోని భూమిని ఆన్ లైన్ చేసి తనకు కొత్త పట్టా పాసుపుస్తకము ఇప్పించగలరని అన్నారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామానికి చెందిన కె.వెంకటాద్రి 2023 సంవత్సరంలో ప్రమాదం జరిగి కుడి కాలు, చేయి విరిగిందని తనకు సదరం ద్వారా జారీచేసిన సర్టిఫికేట్ ద్వారా వికాలాంగుల పింఛను ఇప్పించగలరని కోరారు. గార్ల మండల కేంద్రానికి చెందిన సుందర్ తాను పుట్టుకతోనే వికాలాంగుడినని తాను చిన్నపాటి ఉద్యోగంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉన్నదని తనకు గార్ల మండల కేంద్రంలో సి.ఎస్.సి కేంద్రానికి అనుమతించి తన కుటుంబం ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన ( 146 ) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు,జడ్పీ సీఈవో పురుషోత్తం,అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.





# గొప్ప స్వతంత్ర సమరయోధుడు కామ్రేడ్ భగత్ సింగ్.

- ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేయాలి.
- పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్.

**చేవెళ్ల మార్చి 23(ప్రజాక్షేత్రం):**

కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, ల 95 వ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ మాట్లాడుతూ హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ ఆర్మీ ( హెచ్ఎస్ ఆర్ ఏ ) సైమన్ కమిషన్ గో బ్యాక్ ఉద్యమంలో స్కాట్ అనే బ్రిటిష్ అధికారి లాలా లజపతిరాయ్ ని చంపాడు. దీనికి ప్రతీకారంగా పొరపాటున భగత్ సింగ్ స్కాట్ కు బదులు మరొక అధికారి జేపి శాండర్స్ ను చంపారు. ఇది దేశంలో ఒక సంచలనం అయింది. ఈ ఘటన భారత జాతీయ ఉద్యమంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లను అగ్రశ్రేణిలో నిలిపింది. ఆనాటి రైతంగాన్ని కార్మికులను యువకులను విద్యార్థులను ఉద్యమంలోకి తీసుకురావడం కోసం నవ జవాన్ భారత్ సభను ఏర్పాటు చేశారు. దీని తదనంతరం కమ్యూనిస్టు పార్టీకి కూడా అనుబంధ సంఘంగా నడిపారు. ఉధృతం అవుతున్న కార్మిక విద్యార్థి రైతంగ ఉద్యమాలు ప్రాబల్యం పెంచుకుంటున్న కమ్యూనిస్టులను అణిచివేయడం కోసం కుట్రపూరితంగా బ్రిటిష్ ప్రభుత్వం పబ్లిక్ సేఫ్టీ బిల్, కార్మిక వివాదాల బిల్లులను తీసుకొచ్చింది. దీనికి నిరసన తెలియజేయడానికి భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, లు పార్లమెంటు సెంట్రల్ హాల్లో పొగ బాంబులు విసిరారు. దానికి బ్రిటిష్ ప్రభుత్వం వీరిని అక్రమంగా అరెస్టు చేసి 1931 మార్చి 23న ఉరితీసింది. నో నోకి మీసాల నవ యవ్వనంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్, లు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. కులం, మతం, దోపిడీ, అంతరాలు లేని సమాజాన్ని కోరుకున్నారు. ఇంకా ఇలా జిందాబాద్ అని నినదించారు అని అన్నారు. అదేవిధంగా ఎన్నికల హామీలలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు డివిజన్ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి శ్రీకాంత్, సురేష్, అనిల్, రాజేష్, సాయి, తదితరులున్నారు.



# పదో తరగతి పరీక్షా కేంద్రాలలో కలెక్టర్ తనిఖీ

**కరీంనగర్,మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం పర్యవేక్షించారు. సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుమల నగర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆమె సందర్శించారు.ఇంగ్లీష్ పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించిన కలెక్టర్, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. తరగతి గదుల్లో తగిన గాలి, వెలుతురు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకోవాలని, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**అడిషనల్ కలెక్టర్ తనిఖీ**

హౌసింగ్ బోర్డు కాలనీ (కుమర్వాడి), సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తనిఖీ చేశారు. పరీక్షలు నిబంధనలకు అనుగుణంగా కచ్చితంగా నిర్వహించాలని, ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో వసతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆమె పేర్కొన్నారు.



# తహసీల్దార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు

- కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం
- పలువురు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**పెద్ద కొడప్‌గల్ మార్చి 23(ప్రజాక్షేత్రం):**

సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కన్నెబోయ్, బాల్ సింగ్ సర్దార్ తాండ, అంజనీ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్. బిక్షపతి లబ్ధిదారులకు చెక్కులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజల అభ్యున్నతికి దోహదపడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు పెద్ద ఎత్తున ఉపశమనం కలుగుతోందన్నారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ సహాయం తమకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమం సజావుగా కొనసాగగా, అధికారులు అవసరమైన వివరాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ చి. అంజయ్య, జీపీఓ సాయిలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి. మహేందర్ రెడ్డి మరియు ఇతర సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులపై దాడికి పాల్పడ్డ నిందితులను అరెస్టు చేయాలి

- ఆర్డీఓకు ఎం జే ఎఫ్ నాయకుల వినతి.
- రాజకీయ ఒత్తిళ్లతోనే పోలీసుల జాప్యం.
- జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని చేవెళ్ల ఆర్డీఓకు విజ్ఞప్తి
- మాదిగ జర్నలిస్టుల ఫోరం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ మహేష్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 23(ప్రజాక్షేత్రం):**

ఇటీవల షాబాద్ మండలంలో దళిత జర్నలిస్టులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చెయ్యాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఎంజేఎఫ్ (మాదిగ జర్నలిస్ట్ ఫోరం) చేవెళ్ల డివిజన్ కన్వీనర్ మహేష్ ఆశిగారి ఆధ్వర్యంలో జర్నలిస్టులతో కలిసి చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని, వాస్తవాలను వెలుగులోకి తెచ్చే కలం సైనికులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. క్షేత్రస్థాయిలో వార్తలు సేకరించే రిపోర్టర్లపై భౌతిక దాడులు, బెదిరింపులు, ఆన్‌లైన్ వేధింపులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కోణంలో షాబాద్ మండలంలో ఇటీవల దళిత జర్నలిస్టులపై దాడి జరిగిందని వాపోయారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి 20 రోజులు కావస్తున్న నిందితులను రిమాండ్ చెయ్యకుండా రాజకీయ నాయకులకు పోలీసులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. పోలీసు అధికారులు కేసు పురోగతిలో కాలయాపన చేస్తుందటంతో నిందితులు సాక్షులను, ఆధారలను తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. జర్నలిస్టులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండ విధినిర్వహణలో ఎన్నో కష్టాలకోర్చి అనేక వాస్తవిక స్థితిగతుల సమాచారాన్ని ప్రజలకు చేరవేసే జర్నలిస్టులకు సమాజంలో ఎంతో గౌరవం ఉందని విధి నిర్వహణలో భాగంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి నిగ్గు తేల్చే నిజాలను ప్రజల ముందుంచే వారే జర్నలిస్టులని అలాంటి జర్నలిస్టులపై బెదిరింపులు, నిర్బంధాలు, దాడులు, అపహరణ, లాంటి సంఘటనలు పెరిగిపోతున్నాయని ఇది ప్రజాస్వామ్య బద్ధం కాదని తమకు జరిగిన అన్యాయం పై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకపోవడంలో అధికారుల మౌనం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పోలీసులు అధికార యంత్రాంగం వెంటనే స్పందించి చట్ట బద్దంగా నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులను ప్రతి ఒక జర్నలిస్టు ఖండించి, మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ నర్సాని రమేష్, జర్నలిస్టులు నరేందర్, అమర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ సర్కార్ పై టీఆర్పి నాయకుల ఆగ్రహం

- బడ్జెట్‌లో ప్రభుత్వాలు బీసీలకు మొండిచేయి
- జిల్లా నాయకత్వంతో నల్ల బ్యాడ్జీలతో ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి
- కరీంనగర్ జిల్లాలో భారీ ర్యాలీ, కలెక్టర్ కార్యాలయం ముట్టడి
- అరెస్ట్ చేసి పోలీస్ ట్రెనింగ్ సెంటర్ కి తరలించిన పోలీసులు
- సీఎం రేవంత్ రాజీనామా చేయాలని అఖిల్ పాషా డిమాండ్.

**కరీంనగర్,మార్చి 23 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో బీసీలకు తగిన నిధులు కేటాయించలేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యవర్గం మరియు రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా హాజరయ్యారు. పార్టీ నాయకులు కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి, కన్లకు గంతలు కట్టుకొని నగరంలో గితభావన్ చౌరస్తా నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించే ప్రయత్నం చేశారు. పోలీసులు అప్రమత్తమై పార్టీ నాయకులను కార్యకర్తలను అరెస్ట్ చేసి నగరంలో ఉన్న సిటీ పోలీస్ ట్రెనింగ్ సెంటర్ కి తరలించారు. అనంతరం టీఆర్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మీడియా తో మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో బిసిలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని, అట్టి దొంగ హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని రేవంత్ గుర్తుతెచ్చుకోవాలని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రతి ఏడాది బీసీల అభివృద్ధికి 20,000 కోట్లు కేటాయిస్తామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 12,000 కోట్లకే పరిమితం చేయడం అన్యాయమని, బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని చెప్పి పక్కన పెట్టడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో 60% ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం 3.86% మాత్రమే కేటాయించి అందులో పక్కా ఖర్చు చేసేది 1% మాత్రమే అని చెప్పుకొచ్చారు. అధిక శాతం ఉన్న బిసిలకు బడ్జెట్ విషయంలో న్యాయానికి విరుద్ధమని మండిపడ్డారు. బిసిలకు 51% బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా, ప్రభుత్వం కేవలం అంకెల గారడీతో ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో బీసీలకు సరైన ప్రాతినిధ్యం లేదని, 16 మంది మంత్రుల్లో కేవలం ముగ్గురు మాత్రమే బీసీ వర్గానికి చెందినవారని పేర్కొన్నారు. అదే సమయంలో తక్కువ శాతం ఉన్న వర్గాలకు అధిక ప్రాతినిధ్యం ఇవ్వడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా,జిల్లా ఉపాధ్యక్షుడు ఇరగదిండ్ల సురేశ్, మైనార్టీ ప్రెసిడెంట్ వాజిద్,ప్రధాన కార్యదర్శి అంకుష్,యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్,టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, మండల అధ్యక్షులు ఓర్సు రాజు, చెరుకు పైడయ్య,అమ్మిగల్ల కుమార్,కిరణ్,ఇశ్రత్ శవాలి, కనుమల సరిత,విమల,చిగుర్ల మోహన్,కోట సమ్మయ్య,కొప్పుల వెంకటేష్,ఓర్సు కార్తీక్, దండుగల మోహన్,సల్లంగుల రాము,కృష్ణ, సత్తిష్,విజయ్,వంశీ తదితర నాయకులు పాల్గొన్నారు.





# సోషల్ మీడియా ముసుగులో బ్లాక్ మెయిలింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- టీయూడబ్ల్యూజే (ఐజేయు) షాద్‌నగర్ డివిజన్ ప్రింట్ మీడియా అధ్యక్షుడు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 23(ప్రజాక్షేత్రం):**

మీడియా, జర్నలిస్టుల పేరుతో సోషల్ మీడియా వేదికగా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారిపై పోలీసులు నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో టీయూడబ్ల్యూజే (ఐజేయు) షాద్‌నగర్ డివిజన్ ప్రింట్ మీడియా అధ్యక్షుడు బూర్గుల ఫణీంద్ర, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ నాయక్, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇలియాజ్, సంయుక్త కార్యదర్శి అల్వాల దర్శన్ గౌడ్, కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సమీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బూర్గుల ఫణీంద్ర మాట్లాడుతూ ఇటీవల కొంతమంది సోషల్ మీడియా ముసుగులో మోసాలకు పాల్పడుతూ జర్నలిస్టుల పేరును దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వ్యక్తులను గుర్తించి వారిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారి వల్ల నిజాయితీగా పనిచేస్తున్న విలేకరులకు చెడ్డపేరు వస్తోందని పేర్కొన్నారు. అందువల్ల డిసిపి, ఏసిపి, సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు ప్రత్యేక నిఘా పెట్టి, ఇటువంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ఈ తరహా అక్రమాలపై పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.





# కొండ సురేఖ, పట్నం మహేందర్ సీతారామచంద్ర స్వామివారి కల్యాణోత్సవానికి ఆహ్వానం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 23(ప్రజాక్షేత్రం):**

ఈనెల 27వ తేదీన షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవానికి రావాలని దేవాదాయ శాఖ మంత్రి, కొండ సురేఖను, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ ని నగరంలోని వారి నివాసంలో శాలువాతో సీతారాంపూర్ గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవానికి రావాలని ఆహ్వానించారు. స్పందించిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణోత్సవానికి విచ్చేయనున్నట్లు సీతారాంపూర్ సర్పంచ్ తోపుకొండ పావని చెన్నయ్య మరియు గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సీతారాంపూర్, గ్రామానికి చెందిన ఏకాంబ రెడ్డి, మనీ చించేట్టి, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, విజయలక్ష్మి, డాక్టర్ రాజు, తదితరులు మంత్రి, ప్రభుత్వ విప్ ని ఆహ్వానించిన వారిలో ఉన్నారు.




## అమ్మానాన్న లేరు.. కాళ్లు మొక్కుతా..

# పాస్ చేయండి సర్'

- ఇంటర్ విద్యార్థి ఆన్సర్ షీట్ వైరల్!
- తెలంగాణ ఇంటర్ విద్యార్థి ఆన్సర్ షీట్ సోషల్ మీడియాలో వైరల్
- పాస్ చేయాలంటూ ఎగ్జామినర్ కాళ్లు పట్టుకున్నట్టు బొమ్మ గీసిన విద్యార్థి
- అమ్మానాన్న లేరని, గురువులే దేవుళ్లంటూ ఎమోషనల్ డ్రామా
- తాను చదివిన ప్రశ్నలు రాలేదని జవాబు పత్రంలో ఆవేదన
- పేపర్ దిద్దే ఎగ్జామినరే ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వెలుగులోకి ఘటన

**హైదరాబాద్ మార్చి 23(ప్రజాక్షేత్రం):**

పరీక్షల్లో జవాబులు రాకపోతే కొందరు విద్యార్థులు పాస్ చేయమంటూ ప్రాధేయపడటం, జవాబు పత్రాల్లో డబ్బులు పెట్టడం వంటివి చూస్తుంటాం. కానీ, తెలంగాణకు చెందిన ఓ ఇంటర్ విద్యార్థి మరో అడుగు ముందుకేశాడు. తనను పాస్ చేయాలంటూ జవాబు పత్రంలో ఏకంగా బొమ్మలు గీసి, దీనంగా వేడుకున్నాడు. ప్రస్తుతం ఈ ఆన్సర్ షీట్‌ను పేపర్ దిద్దే ఓ ఎగ్జామినర్ ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇది వైరల్ అవుతోంది. ఇటీవల తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ముగియడంతో ప్రస్తుతం జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతోంది. ఈ క్రమంలో ఓ విద్యార్థి రాసిన సమాధాన పత్రం చూసి ఎగ్జామినర్ ఆశ్చర్యపోయారు. ఆ విద్యార్థి 'సార్.. మీ కాళ్లు మొక్కుతా.. నన్ను పాస్ చేయండి' అని వేడుకున్నాడు. అంతటితో ఆగకుండా, ఓ గురువు కాళ్లపై శిష్యుడు పడి నమస్కరిస్తున్నట్టుగా బొమ్మ గీశాడు. ఆ గురువు కింద 'సార్' అని, శిష్యుడి కింద 'నేను' అని రాసి తన సృజనాత్మకతను ప్రదర్శించాడు. కేవలం బొమ్మలతోనే సరిపెట్టకుండా, ఎగ్జామినర్‌ను ప్రసన్నం చేసుకునేందుకు భావోద్వేగ అస్త్రాన్ని కూడా ప్రయోగించాడు. తనకు అమ్మానాన్న లేరని, గురువులే తనకు తల్లిదండ్రులని పేర్కొన్నాడు. అంతేకాదు 'దేవుడు ఉన్నాడని నేను నమ్ముతున్నాను.. ఆ దేవుడు కూడా మీరే సార్' అంటూ ఎగ్జామినర్‌ను పొగడ్తలతో ముంచెత్తాడు. తాను ఎంతో కష్టపడి చదివిన ప్రశ్నలేవీ పరీక్షలో రాలేదని కూడా తన ఆవేదనను వెలిబుచ్చాడు. తనను ఈ ఒక్కసారికి పాస్ చేస్తే ఆ మేలు మర్చిపోనని, దయచేసి పాస్ చేయాలని 'ప్లీజ్ సార్' అంటూ పదే పదే అభ్యర్థించాడు. పరీక్షల్లో సమాధానాలకు బదులుగా ఇలాంటి వింత సమాధానాలు, వేడుకోళ్లు రాయడం కొత్త కానప్పటికీ, ఈ విద్యార్థి చూపిన క్రియేటివిటీ మాత్రం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.



# నర్కూడ గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడుగా చోటా మహేష్ యాదవ్

**రాజేంద్రనగర్, మార్చి 23(ప్రజాక్షేత్రం):**


రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కూడ గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడుగా చోటా మహేష్ యాదవ్ గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబీ డైరెక్టర్, శంషాబాద్ మాజీ జడ్పీటీసీ బూర్కుంట సతీష్, శంషాబాద్ మాజీ ఎంపీపీ డి. జయమ్మ, శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చిలకమర్రి నర్సింహా మండలం బీసీ సెల్ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గౌస్ పాషా, నార్కుంట బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బి బాబు కలసి పార్టీ అధ్యక్షుడు గా సోమవారం ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తెరాస పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. తెరాస పార్టీ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను చూసి మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయం పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నీ ప్రజా పాలన చూసి ప్రజలు తీవ్రంగా ఉన్నారని తెలిపారు. పార్టీ కోసం పాటు పడుతూ... ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ గౌడ్, జంగా చారి, బి అరవింద్, నర్సింహా చారి, పాశం మురళీ, కొండ అఖిల్, కుమ్మరి రాజు అఖిల్ చారి, తదితరులు పార్టీ చేరినట్లు ఆయన తెలిపారు.




# కీడు సోకిందని ఊరు ఖాళీచేసిన గ్రామస్తులు

**జమ్మికుంట మార్చి 23(ప్రజాక్షేత్రం):**

జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామంలో గత మూడు నెలలుగా వరుసగా 28 మంది వివిధ కారణాలతో మరణించడంతో గ్రామంలో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామానికి ఏదో కీడుసోకిందని బలంగా నమ్మిన గ్రామస్తులు, పురోహితుడి సూచన మేరకు వింత నిర్ణయం తీసుకున్నారు. ఒకరోజంతా గ్రామస్తులు ఊరు మొత్తం ఖాళీ చేసి వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి కీడు వంటలు వండుకోవాలని నిర్ణయించుకున్నారు. దీనికోసం సోమవారం తెల్లవారు జామునే ఇళ్లకు తాళాలు వేసి గ్రామంలో డప్పు చాటింపు వేయించి మరీ ఊరి బయటకు వెళ్లారు. ఇలా చేస్తేనే గ్రామానికి పట్టిన (కీడు) పీడ విరుగడవుతుందని గ్రామస్తులు విశ్వసిస్తున్నారు.



# జర్నలిస్టుల జంగ్.. 25న 'ఛలో హైదరాబాద్'

- సర్కారు నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగిన టి డబ్ల్యూ జె ఎఫ్.
- బడ్జెట్‌లో మొండిచేయి.. హామీలు గాలికి.
- ఐ అండ్ పీఆర్ ముట్టడికి సోమయ్య పిలుపు.

హైదరాబాద్ మార్చి 23(ప్రజాక్షేత్రం):

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరిపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టి డబ్ల్యూ జె ఎఫ్) యుద్ధం ప్రకటించింది. "మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు గడప దాటడం లేదు" అన్న చందంగా తయారైన సర్కారు తీరుకు నిరసనగా ఈనెల 25న 'ఛలో హైదరాబాద్ ఐ అండ్ పీఆర్ కార్యాలయ ముట్టడి' కి పిలుపునిచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కీలక సమావేశంలో ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడారు.

**రెండేళ్ల పాలన.. అన్నీ నీటిమూటలే!**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, జర్నలిస్టుల సంక్షేమం అటకెక్కిందని సోమయ్య మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. "ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జర్నలిస్టుల ఊసే లేదు. ఇది పాత్రికేయ లోకంపై ప్రభుత్వం చూపిస్తున్న వివక్షకు పరాకాష్ట" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సమస్యల సుడిగుండంలో కలం యోధులు**

ప్రభుత్వం జర్నలిస్టులను ఉద్దేశపూర్వకంగానే ఇబ్బందులకు గురిచేస్తోందని సోమయ్య దుయ్యబట్టారు.

**ఆయన లేవనెత్తిన ప్రధానాంశాలు**

అక్రెడిటేషన్ల అగచాట్లు
రెండేళ్లు దాటినా కొత్త కార్డులు ఇవ్వకపోవడంతో ఫీల్డ్‌లో జర్నలిస్టులు అవమానాలు ఎదుర్కొంటున్నారు.
హెల్త్ కార్డులు హుష్కాకీ
అనారోగ్యం పాలైతే ఆదుకునే దిక్కులేదు. హెల్త్ కార్డుల జారీలో జాప్యం ప్రాణాల మీదకు తెస్తోంది.
ఇళ్ల స్థలాల సాకు
సుప్రీంకోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని ఇళ్ల స్థలాల కేటాయింపులో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది.
పెన్షన్ల విస్మరణ
పొరుగు రాష్ట్రాల్లో ఇస్తున్నట్లుగా రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్లు ఇచ్చే ఆలోచనే ఈ సర్కారుకు లేదు.
మీడియా అకాడమీ నిద్ర
అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్‌ను నియమించకుండా నిర్వీర్యం చేస్తున్నారు.
చిన్న పత్రికల గొంతు నులుముతున్నారు!
చిన్న, మధ్య తరహా పత్రికలపై ప్రభుత్వం కక్ష సాధింపునకు దిగుతోందని సోమయ్య ఆరోపించారు. రెండేళ్లుగా అడ్వర్టైజ్‌మెంట్ బిల్లులు చెల్లించకపోవడంతో ఆయా పత్రికల యజమానులు, జర్నలిస్టులు వీధిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్నా ఎంపానల్‌మెంట్ చేయకుండా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. "జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ప్రసక్తే లేదు. 25న జరిగే ఐ అండ్ పీఆర్ ముట్టడికి రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయులు తరలిరావాలి. మన హక్కులను పోరాడి సాధించుకుందాం."

**మామిడి సోమయ్య,**
**టి డబ్ల్యూ జె ఎఫ్ కన్వీనర్.**



# అప్పు తీర్చలేదని వ్యక్తిపై హత్యాయత్నం

సంగారెడ్డి మార్చి 23(ప్రజాక్షేత్రం):

అప్పుగా తీసుకున్న డబ్బుల విషయంలో తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, ఒక వ్యక్తిపై ఐదుగురు కలిసి ప్రాణాంతక దాడి చేసిన ఘటన ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కలివేముల గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**ఘటన వివరాలు**

కలివేముల గ్రామానికి చెందిన ముండేలా అనిల్ (35) అనే వ్యక్తి, సోమవారం ఉదయం గ్రామంలోని కల్లు దుకాణానికి వెళ్ళాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన తలారి పాండు మరియు అతని భార్య సునీత అక్కడకు వచ్చి, అనిల్ తమకు ఇవ్వాల్సిన రూ. 1,00,000 అప్పు గురించి నిలదీశారు. అనిల్ ప్రస్తుతం తన వద్ద రూ. 50,000 మాత్రమే ఉన్నాయని చెప్పినప్పటికీ, వారు వినకుండా గొడవకు దిగారు.

**ప్రాణాంతక దాడి**

గొడవ పెద్దది కావడంతో తలారి పాండు కల్లు సీసాతో అనిల్ తలపై బలంగా కొట్టాడు. అనంతరం సునీత తన కొడుకు సందీప్, బావ శేఖర్ మరియు అతని కొడుకు వినయ్‌లను అక్కడికి పిలిపించింది. వీరందరూ కలిసి అనిల్‌ను చంపాలనే ఉద్దేశ్యంతో కర్రలతో విచక్షణారహితంగా కొడుతూ, కడుపు మరియు ఛాతిపై తన్నారు.

**ప్రస్తుత పరిస్థితి**

ఈ దాడిలో అనిల్ తల, కుడి కన్ను మరియు చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అనిల్ అక్కడ చికిత్స పొందుతున్నాడు. బాధితుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# మాగంటి గోపీనాథ్ కుటుంబంలో మరో విషాదం

హైదరాబాద్ మార్చి 23(ప్రజాక్షేత్రం):

జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, దివంగత మగంటి గోపీనాథ్ కుమార్తెలు అక్షర నాగ్, శిశిర నార్సింగి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు పై జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలకు గుర్రై, ప్రస్తుతం కోలుకుంటున్నారు. పోలీసుల ప్రకారం, ఆ యువతి, ఆమె ఇద్దరు స్నేహితులు శంషాబాద్ విమానాశ్రయం నుండి గచ్చిబౌలి వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. నార్సింగి మార్గంలో ప్రయాణిస్తుండగా వారి ఫార్చ్యూనర్ కారు టైర్ ఊడిపోవడంతో ముందు వెళ్తున్న ఒక డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురూ గాయపడగా, అక్షర, సిసిర స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని తక్షణమే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఒకరిని దింపి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నార్సింగి పోలీసులు, ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. డీసీఎం, కారును క్రేన్ల సహాయంతో రోడ్డు పక్కకు తరలించారు. పోలీసులు ఆ ప్రమాదానికి అతివేగాన్ని కారణంగా పేర్కొన్నారు. ఈ ఘటనపై బీఎన్ఎస్ లోని సెక్షన్ 125 (A) కింద ఒక కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

- రూ.5,950 తగ్గిన 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర
- రూ.5,450 తగ్గిన 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం
- రూ. 20 వేలు తగ్గిన కిలో వెండి

హైదరాబాద్ మార్చి 23(ప్రజాక్షేత్రం):



గత కొంతకాలంగా కొండెక్కి కూర్చున్న బంగారం, వెండి ధరలు ఇవాళ ఊహించని రీతిలో కుప్పకూలాయి. అంతర్జాతీయ మార్కెట్లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాల ప్రభావం దేశీయ బులియన్ మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ మార్కెట్‌లో ధరలు భారీగా తగ్గడంతో జ్యువెలరీ షాపుల వద్ద సందడి మొదలైంది. 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) నిన్నటితో పోలిస్తే ఏకంగా రూ. 5,950 తగ్గి, ప్రస్తుతం రూ. 1,40,020 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ. 5,450 పతనమై రూ. 1,28,350 కు చేరింది. కిలో వెండి ధర ఏకంగా రూ. 20,000 తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి రూ. 2,30,000 పలుకుతోంది. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం... అంతర్జాతీయంగా డాలర్ విలువ పెరగడం, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపర్లు బంగారంపై పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్నారు. బంగారం, వెండి ధరలు తగ్గడానికి ఇది బలమైన కారణం. మరోవైపు, ఇది పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఈ ధరల తగ్గింపు మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఊరట. అయితే, మార్కెట్ చాలా అస్థిరంగా ఉంది. ధరలు ఇంకా తగ్గుతాయా? లేక మళ్ళీ పుంజుకుంటాయా? అనేది అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

# అచ్చంపేట గురుకుల పాఠశాలలో వంటగ్యాస్ సమస్యలను పరిష్కరించాలి

- అచ్చంపేట గురుకుల పాఠశాలలో వంటగ్యాస్ సమస్యలను పరిష్కరించాలి
- (ఏఐయస్బి) జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ డిమాండ్

నిజాంసాగర్, మర్చి 23(ప్రజాక్షేత్రం):

అచ్చంపేట గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో నెలకొన్న వంటగ్యాస్ సమస్యను అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణమే పరిష్కరించాలని (ఏఐయస్బి) ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వారం రోజులుగా పాఠశాలకు వంటగ్యాస్ సరఫరా లేకపోవడంతో విద్యార్థుల మెనూ గాడి తప్పిందన్నారు. గతంలో ఈ పాఠశాల జుక్కల్ మండల కేంద్రంలో ఉండేదని, అక్కడ వసతులు సరిగా లేకపోవడంతో అచ్చంపేటకు మార్పిడి చేసినట్లు గుర్తు చేశారు. గత ఐదేళ్లుగా ఇండెన్ గ్యాస్ స్థానంలో హెచ్‌పి గ్యాస్ సరఫరా చేస్తున్న నిజాంసాగర్‌లోని వీరభద్ర ఏజెన్సీ నిర్వాహకుడు ప్రస్తుతం సరఫరా చేయలేనని చెప్పడంతో సమస్య తలెత్తిందన్నారు. ఈనెల 18న ఏజెన్సీ మార్పిడి పత్రం తీసుకువచ్చినప్పటికీ, నిర్వాహకుడు దానిని అంగీకరించకపోవడంతో సమస్య మరింత క్లిష్టంగా మారిందని పాఠశాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.ఇండెన్ గ్యాస్ లేకపోవడం, హెచ్‌పి గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా సమస్య కొనసాగుతున్నప్పటికీ, పత్రికల్లో వార్తలు వచ్చినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు.రెండు రోజుల్లో గ్యాస్ కంపెనీలతో మాట్లాడి సమస్యను పరిష్కరించకపోతే, పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దళితబహుజన సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.





# బోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ కృషితోనే ఫైర్ ఇంజన్.

ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 23(ప్రజాక్షేత్రం):-

బోథ్ కు ఫైర్ ఇంజన్ మంజూరు కావడంలో ముమ్మాటికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కృషియే కారణం .... కానీ కాంగ్రెస్ పార్టీ వల్లే వచ్చిందని అబద్ధాలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా పిలవబడే ఆడే గజేందర్ పై బిఆరెస్ నాయకుడు బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేశారు.... ఖబర్దార్ గజేందర్ అబద్దాల కంటూ ఒక హద్దు ఉంటుంది... సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుకోవడంలో కాంగ్రెస్ పార్టీకె చెల్లిందని అన్నారు. పలు మార్లు రాష్ట్ర అసెంబ్లీలో బోథ్ సమస్యలను గౌరవ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అసెంబ్లీలో ప్రస్తావించడం కాంగ్రెస్ నాయకులకు కనబడలేదా అని ప్రశ్నించారు... సంబంధిత మంత్రులతోపాటు ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలను తీసుకెళ్లడంతోనే బోథ్ కు ఫైర్ స్టేషన్ మంజూరు అయ్యిందని అన్నారు... అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన మీకు బి.ఆర్.ఎస్ ను ఎమ్మెల్యేను విమర్శించే నైతిక అర్హత లేదని అన్నారు... మూడు విడుతలుగా రైతు భరోసా దాదాపు 24 వేల కోట్లు రైతుల డబ్బులు ఎగ్గొట్టిన ఘనత మీది... పింఛన్ల పెంపుదల ఊసే లేదు... కౌలు రైతులకు ఇస్తానన్న 12000 లేవు... 6 గ్యారంటీల అమలు గాలికి వదిలేసారు... మీరా మాకు చెప్పేది అని విమర్శించారు. గౌరవ ఎమ్మెల్యేకు మంచి పేరు వస్తుందని అక్కసుతో అబద్ధపు ప్రచారాలు చేయడం సిగ్గుచేటు అన్నారు.... మీకు దమ్ముంటే మీ మంత్రులు, ముఖ్యమంత్రి తో మాట్లాడి బోథ్ రెవిన్యూ డివిజన్ తెప్పించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, మినీ స్టేడియం మంజూరు చేయించాలని డీఎస్పీ ఆఫీస్ ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు.... మీకు పనులు చేయడం చేతకాదు కానీ ఒకరు చేసిన పనులు మేము చేసాము అని చెప్పుకోవడం మాత్రం బాగా వచ్చు అని విమర్శించారు... ఎమ్మెల్యే లెటర్ లేనిదే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆమోదం లభించదనే కనీస కామన్ సెన్స్ లేని వీరు నాయకులా అని ప్రశ్నించారు... ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోండి గ్రామాల్లోకి వెళితే ప్రజలు తరిమికొట్టే రోజులు వచ్చాయి... వచ్చే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలలో జరిగేది అదే అని జోస్యం చెప్పారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/26/A2094